PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 25 | విజయవాడ, ఆదివారం 25 ఆగస్టు 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 25 August 2024 | Rs

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ అభ్యంతరకరం
- మత విభజన సృష్టించి ఓట్లు పొందాలన్నది బిజెపి దుర్బుద్ధి
- కమ్యూనల్ సివిల్ కోడ్ అంటూ రెచ్చగొడుతున్న ప్రధాని
- బివి రాఘవులు ఆందోళన

2



25కు పైగా పతకాలే లక్ష్యం
- భారత పారా ఒలింపిక్ కమిటీ అధ్యక్షులు దేవేంద్ర
- 28నుంచి పారా ఒలింపిక్స్

6

కళ్ల ముందే ఘోరం

ఏం జరిగిందో తెలుసుకునేలోపే కనివిని ఎరుగని పెను ప్రమాదం

కార్మిక సంఘాల నాయకులతో ఎసెన్షియా ప్రమాద బాధితుల ఆవేదన

ప్రజాశక్తి- అనకాపల్లి

'ఐదేళ్లగా ఎసెన్షియా కంపెనీలో పనిచేస్తున్నాను. సీనియర్ కెమిస్ట్‌గా ల్యాబ్‌లో పని చేస్తున్న సమయంలో ఒక్కసారిగా సీలింగ్ కూలిపోయింది. మంటలు వ్యాపించాయి. స్లాబ్ కాళ్లపై పడింది. సేఫ్టీ షూ ఉన్నా బలమైన గాయాలు తగిలాయి. కొద్ది సమయానికి అక్కడ నుంచి నన్ను బయటకు తోడ్కొని వచ్చారు. అంతా అయోమయంగా మారిపోయింది' అని యలమంచిలికి చెందిన సీనియర్ కెమిస్ట్ ఎ.పరమేశ్వరరావు తెలిపారు. అనకాపల్లిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు శనివారం పరామర్శించగా తన బాధ వెళ్లగక్కారు.

'ఏడు సంవత్సరాలుగా కంపెనీలో పని చేస్తున్నాను. ఆ రోజు ఒక్కసారిగా మంటలు రావడం, దట్టమైన పొగలు కమ్మడంతో స్పృహ తప్పి పడిపోయాను. ఏం జరిగిందో తెలియదు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్నాను. ఊపిరి కూడా తీసుకోవడానికి ఇబ్బందిగా నా పరిస్థితి ఉంది. పొగ లోపలకు వెళ్లడం వల్ల ఊపిరితిత్తుల సమస్య ఎదుర్కొంటున్నాను' అని హౌస్‌కీపర్‌గా పనిచేస్తున్న దారపాలేనికి చెందిన రాయి సత్యనారాయణ తన బాధను చెప్పుకొచ్చారు.

'ఏడాదిగా ట్రైనింగ్ కెమిస్ట్‌గా పని చేస్తున్నాను. ప్రమాదం జరిగిన సమయంలో స్లాబు మీద పడడంతో తొడ ఎముక విరిగిపోయింది. ఇంకా నాకు వివాహం కాలేదు. ట్రీట్‌మెంట్ ఎన్నాళ్లు తీసుకోవాలో తెలియడం లేదు. భయమేస్తోంది' అని ట్రైనింగ్ కెమిస్ట్ ఎస్.యామిని తెలిపారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని అసెన్షియా ఫార్మా కంపెనీలో ఈ నెల 21న జరిగిన ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఎవరిని కదిపినా కన్నీటి గాథలే వినిపించాయి. 'ఏం జరిగిందో తెలుసుకునేలోపే ఘోర విపత్తు సంభవించింది' అని వారు చెప్పిన మాటలు నాయకులను, అక్కడున్న వారిని కదిలించాయి. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పాండా, ఐఎఫ్‌టియు రాష్ట్ర సమితి సభ్యులు మల్లన్న తదితరులతో కూడిన అఖిలపక్ష కార్మిక సంఘాల బృందం శనివారం అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆస్పతిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించింది. బాధితులకు అందుతున్న వైద్య సేవలను ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.అవినాష్‌ను అడిగి తెలుసుకుంది. బాధితులకు అండగా ఉంటామని భరోసానిచ్చింది.



ఫార్మా ప్రమాద బాధితురాలిని పరామర్శిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత

28న కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీస్ వద్ద ధర్నా

బాధితులను పరామర్శించిన అనంతరం సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎసెన్షియాలో జరిగిన ప్రమాదానికి పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల అండతోనే యాజమాన్యాలు ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో భద్రతా ప్రమాణాలు పాటించకుండా కంపెనీలను నిర్వహిస్తున్నాయన్నారు. ఫార్మా కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ లేకపోవడం, కార్మికులు యూనియన్లు పెట్టుకోరాదని ఆంక్షలు విధించడం, తనిఖీల నుంచి సెజ్‌లకు మినహాయింపు ఇవ్వడం వంటివి ప్రమాదాలకు కారణాలని తెలిపారు. ఎసెన్షియా ప్రమాద వివరాలను కనీసం బాధిత కుటుంబ సభ్యులకు కూడా మిగతా 5లో

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పిఎస్ స్థానంలో
యూనిఫైడ్ పెన్షన్ స్కీం
- హర్యానా, జమ్ముకాశ్మీర్ ఎన్నికల ముందు కేంద్రం పాచిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సామాజిక భద్రత కోసం కొత్తగా యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యుపిఎస్)కి కేంద్ర ప్రభుత్వం తీసుకురానుంది. త్వరలో జరగనున్న హర్యానా, జమ్ముకాశ్మీర్ ఎన్నికల్లో లబ్ధిపొందే ఉద్దేశంతోనే ఈ పాచిక వేసింది. నూతన పెన్షన్ పథకం (ఎన్‌పిఎస్) స్థానంలో యుపిఎస్‌ను తీసుకొచ్చింది. శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం యుపిఎస్‌కు ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కేంద్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను వివరించారు. రూ.10,579 కోట్ల వ్యయంతో సుమారు 23 లక్షల మంది ఉద్యోగులకు లబ్ది చేకూరే ఏకీకృత పెన్షన్ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. కనీసం 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణకు ముందు 12 నెలల సగటు బేసిక్ జీతంలో 50 శాతం పెన్షన్‌గా ఈ పథకం హామీ ఇస్తుందని తెలిపారు. ఈ పథకం 2025 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వస్తుందని, కొత్త పథకంతో పదేళ్ల సర్వీస్ ఉన్న ఉద్యోగులకు రూ.10 వేలు పెన్షన్, 25 ఏళ్ల సర్వీస్ ఉన్నవారికి పూర్తి పెన్షన్ అందిస్తారని పేర్కొన్నారు. "ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ పథకాలను సమీక్షించిన తరువాత, అనేకమంది వాటాదారులతో సంప్రదించిన తరువాత కమిటీ ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను సూచించింది. ఈ డిమాండ్‌ను పరిష్కరిస్తూ క్యాబినెట్ యుపిఎస్‌కి ఆమోదం తెలిపింది" అని పేర్కొన్నారు. కొత్త పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్)పై అనేక బిజెపియేతర పాలిత రాష్ట్రాల నిరసనలు, త్వరలో హర్యానా, జమ్ము కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ పథకాన్ని (యుపిఎస్) ప్రకటించింది.



మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ (డిఎస్‌టి) పరిధిలోని 'విజ్ఞాన్ ధార' అనే ఏకీకృత కేంద్రరంగ పథకం అమలుకు 2021-22 నుండి 2025-26 వరకు రూ.10,579.84 కోట్లు వ్యయం చేయనున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీకి సంబంధించిన 'బయో ఇ-3 (ఎకానమీ, ఎన్విరాన్‌మెంట్, ఎంప్లాయ్‌మెంట్ ఫర్ బయోటెక్నాలజీ) పాలసీకి మంత్రివర్గ ఆమోదం లభించింది. ఈ విధానం వల్ల బయో టెక్నాలజీ, బయో సైన్స్ రంగాల్లో అధిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

కేంద్రప్రభుత్వ ఉద్యోగుల అసంతృప్తి

యుపిఎస్ స్కీమ్ పట్ల పలువురు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులకు పూర్తిస్థాయి పెన్షన్ ఇవ్వడానికి 20 సంవత్సరాల సర్వీసు సరిపోతుందని, 25 ఏళ్ల సర్వీసుగా నిర్ణయించడం అన్యాయమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దశాబ్దాలపాటు సేవ చేసిన ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడం హక్కు అని, అందుకు భిన్నంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉద్యోగులు తమ వాటా చెల్లించాలన్న విషయంలో ఎన్‌పిఎస్‌కు, యుపిఎస్‌కు మధ్య తేడా లేదని చెబుతున్నారు.

మార్చి 31లోపు రిటైర్ అయ్యే వారికి
బదిలీల నుంచి మినహాయింపు
- జీఓ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2025 మార్చి 31లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు సాధారణ బదిలీల నుంచి ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. ఈ మేరకు శనివారం జీఓఎంఎస్ నెంబరు 76ని విడుదల చేయడంతో పాటు అన్ని డిపార్టుమెంట్స్ హెచ్‌ఓడిలకు ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది మార్చి లోపు పదవీ విరమణ పొందే ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 8 వేల మంది ఉంటారని అంచనా. ప్రభుత్వ నిర్ణయంతో ప్రధానమైన అన్ని శాఖల్లో ఉద్యోగులకు మేలు జరగడంతో పాటు వారి పెన్షన్లు ఫైల్స్ రెడీ చేసుకునే వీలు కలుగుతుందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. బదిలీల ప్రక్రియ ఈనెల 31తో ముగుస్తుండటంతో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందా అని ఆందోళనలో ఉన్న పదవీ విరమణ చేయబోయో ఉద్యోగులకు ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఊరట లభించింది. సాధారణ బదిలీల నుంచి రిటైర్ అయ్యే ఉద్యోగులకు మినహాయింపు నివ్వడం పట్ల ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

30న వనమహోత్సవం
- 11 నగర వనాల అభివృద్ధికి కేంద్రం నిధులు
- ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

3

సాగర్ కెనాల్‌లో ఈతకెళ్లి..
ముగ్గురు విద్యార్థులు గల్లంతు
ఒకరి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- దర్శి (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా దర్శిలోని సాగర్ కెనాల్‌లో ఈతకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు గల్లంతయ్యారు. వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది. మిగతా ఇద్దరి కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... కొత్తపల్లికి చెందిన వైసిపి నాయకులు పోతిరెడ్డి డానియల్‌రెడ్డి కుమారుడు పోతిరెడ్డి లోకేశ్వర్‌రెడ్డి (19), లక్ష్మీపురం గ్రామానికి చెందిన వెంకటనారాయణరెడ్డి కుమారుడు కుందురు చందు కిరణ్‌కుమార్‌రెడ్డి (18), కొర్లమడుగుకు చెందిన భక్తుల జయరామిరెడ్డి కుమారుడు మణికంఠరెడ్డి (18) స్నేహితులు. వీరు ముగ్గురూ కలిసి లోకేశ్వరరెడ్డి బంధువుల వివాహానికి కొత్తపల్లి వెళ్లారు. అనంతరం దర్శిలోని సాగర్ బ్రాంచ్ కెనాల్‌కు వెళ్లి ఈతకు దిగారు. లోతు ఎక్కువగా ఉండడంతో ముగ్గురూ గల్లంతయ్యారు. వారి కోసం గజ ఈతగాళ్లతో అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. లోకేశ్వర్‌రెడ్డి మృతదేహం లభ్యమైంది. మిగతా ఇద్దరి కోసం గాలిస్తున్నారు. లోకేశ్వరరెడ్డి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, దర్శిలోని ప్రభుత్వ కళాశాలలో కిరణ్‌కుమార్‌రెడ్డి, నూజివీడులోని ట్రిబుల్ ఐటిలో మణికంఠరెడ్డి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత
- ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

3



డయాలసిస్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న కిడ్నీ బాధితులను పరామర్శిస్తున్న బాబూరావు



విజ్ఞాన్ వర్సిటీ వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తున్న జస్టిస్ శ్రీ నరసింహ

విద్యార్థులదే భవిష్యత్తు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ

2


భారత వృద్ధి తగ్గొచ్చు..!
- గోల్డ్‌మాన్ సాచ్స్ అంచనా

3

అదృశ్య గోదావరిపై ఆరేళ్ల క్రితమే నివేదిక
- 4 అంశాలపై 29 సంవత్సరాల అధ్యయనం
- ఇద్దరు ముఖ్యమంత్రులకు నివేదించిన నిపుణులు
- అయినా పట్టించుకోని పాలకులు

బి. గోరంట్లప్ప

గోదావరి జలాలు నదీ గర్భంలోనే పెద్ద ఎత్తున అదృశ్యమౌతున్నాయంటూ ప్రజాశక్తి ప్రచురించిన కథనం కలకలం రేపింది. నీటిపారుదల శాఖ వర్గాలతో పాటు, ఆ రంగానికి చెందిన నిపుణుల్లో చర్చనీయాంశమైంది. ఇప్పటికే వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఉండటంతో ప్రాజెక్టు భవితవ్యంపై కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు, గోదావరిలో పెద్ద మొత్తంలో నీళ్ల అదృశ్యమౌతున్నాయంటూ కేంద్ర జలవనరుల సంఘం రూపొందించిన నివేదిక కనీసం ఆరు సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి అందినట్లు సమాచారం. నిజానికి అంతకు కొన్ని సంవత్సరాల ముందే ఈ సమాచారం ప్రభుత్వానికి అందిందని తెలిసింది. ప్రజాశక్తి సేకరించిన సమాచారం ప్రకారం 2018 సంవత్సరం మిగతా 5లో



ఎంత నీరు మాయం...?

అత్యధికంగా 15.08.1983 న కోయిదా వద్ద 58,616 క్యూసెక్కుల ప్రవాహం నమోదు కాగా, అక్కడికి 53 కిలోమీటర్ల దూరం ఉన్న పోలవరం వద్ద 40,176 క్యూసెక్కుల నీటి ప్రవాహం మాత్రమే నమోదైంది.

అంటే,17,900 క్యూసెక్కుల (55 టిఎంసిలు) నీరు మాయమైంది. 29 సంవత్సరాల కాలంలో ఒక్కరోజులో లీకేజి అయిన నీటిలో ఇది అత్యధికం! ఈ అధ్యయనం ఆధారంగా భారీ వరద ప్రవాహం ఉన్న సమయంలో సగటున రోజుకు 28 టిఎంసీల నీరు నష్టపోతున్నట్లు నిపుణులు లెక్క తేల్చారు.

మహిళా నిరుద్యోగం సెగలు



- జూన్ త్రైమాసికంలో మరింత పెరుగుదల
- పట్టణాల్లో ఉపాధి కరువు తగ్గిన శ్రామిక శక్తి

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టిస్తున్నామని పదే పదే పేర్కొంటున్న మోడీ సర్కార్.. దీనికి భిన్నంగా దేశంలో మహిళా నిరుద్యోగం భారీగా పెరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో పట్టణ ప్రాంతాల్లో మహిళల నిరుద్యోగం 9 శాతానికి ఎగిసిందని పిరియడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్‌ఎఫ్‌ఎస్) గణంకాలు వెల్లడించాయి. ఇంతక్రితం మార్చి త్రైమాసికంలో ఇది 8.5 శాతంగా ఉంది. ఇదే సమయంలో 25.6 శాతంగా ఉన్న మహిళా శ్రామిక శక్తి.. గడిచిన ఏప్రిల్ త్రైమాసికంలో 25.2 శాతానికి పడిపోవడం ఆందోళనకరం. తక్కువ మంది మహిళలు పని కోసం చూస్తున్నప్పటికీ, కార్మిక మార్కెట్‌లు వారికి తగినంత ఉద్యోగాను సృష్టించలేక పోతున్నాయి. స్వయం ఉపాధిలో క్షీణత కారణంగా ఉద్యోగ రేటు తగ్గిందని పిఎల్‌ఎఫ్‌ఎస్ డేటా వెల్లడించింది.

స్వయం ఉపాధికి ఎసరు

ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ లేకపోవడం స్వయం ఉపాధిని దెబ్బతీస్తోంది. 2024 మార్చి త్రైమాసికంలో స్వయం ఉపాధి పొందుతున్న మహిళల వాటా 41.3 శాతంగా ఉండగా.. ఇది ఏప్రిల్ త్రైమాసికంలో 40 శాతానికి పడిపోవడం మరింత ఆందోళనకర అంశం. సాధారణ కార్మికులుగా పని చేస్తున్న మహిళల వాటా సంబంధిత కాలంలో 6.5 శాతం నుండి 6 శాతానికి తగ్గింది. పిఎల్‌ఎఫ్‌ఎస్ రిపోర్ట్‌లో అధికారిక, అనధికారిక రంగాల్లోని ఉపాధి అవకాశాలను పరిగణలోకి తీసుకుంది. స్వయం ఉపాధిలో కార్మికులుగా పని చేస్తున్న మహిళల వాటాలో తగ్గుదల అనేది అనధికారిక రంగంలో అవకాశాలు క్షీణిస్తున్నయనడానికి ప్రాథమిక సంకేతాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



ఎన్ కన్వెన్షన్ నేలమట్టం
- తమ్మడికుంట చెరువులో ఆక్రమణలను కూల్చేసిన 'హైడ్రా'
- అది పట్టా భూమి : అక్కినేని నాగార్జున
- మూడున్నర ఎకరాల భూమి కబ్జా చేశారు : కమిషనర్
- కూల్చివేతలు ఆపండి : హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన భూములు కలిగిన మాదాపూర్ సమీపంలోగల ఖానామెట్ గ్రామ పరిధిలోని తమ్మిడికుంట చెరువు బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మించిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) నేలమట్టం చేసింది. చెరువు ఆక్రమణపై హైడ్రాకు అందిన ఫిర్యాదుల మేరకు జిహెచ్‌ఎంసి టౌన్ ప్లానింగ్, హైడ్రా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మిగతా 5లో

మేఘాలయ సిఎంకు అస్వస్థత
- టైఫాయిడ్, స్క్రబ్ టైఫస్‌కు చికిత్స

గౌహతి : మేఘాలయ ముఖ్యమంత్రి కె.సంగ్మా శుక్రవారం అస్వస్థతతో ఆస్పత్రిలో చేరారు. ఆయన టైఫాయిడ్, స్క్రబ్ టైఫస్‌తో బాధపడుతున్నట్లు తేలింది. తీవ్రంగా జ్వరం వచ్చి గురువారం ఆయనకు బాగా లేదని, ఇంటివద్దనే చికిత్స తీసుకున్నారని, రక్తపరీక్షలు చేయగా, టైఫాయిడ్, టైఫస్ పాజిటివ్ రావడంతో షిల్లాంగ్ సివిల్ ఆస్పత్రిలో చేర్చినట్లు అధికారిక ప్రకటన పేర్కొంది. డాక్టర్లు అవసరమైన చికిత్సనందిస్తున్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారని ఆ ప్రకటన తెలిపింది. బుష్ టైఫస్ లేదా స్క్రబ్ టైఫస్‌గా పిలిచే ఈ వ్యాధి ఒరెన్షియా బాక్టీరియా వల్ల వస్తుంది. ఇన్‌ఫెక్ట్ అయిన లార్వా కుట్టడం వల్ల ఇది వ్యక్తుల నుండి వ్యక్తులకు వ్యాపిస్తుంది. జ్వరం, తలనొప్పి, ఒళు నొప్పులు, దద్దుర్లు వంటి అత్యంత సాధారణమైన లక్షణాలే వుంటాయి. టైఫాయిడ్ ఆహారం లేదా నీరు కలుషితం కావడం వల్ల వ్యాప్తి చెందుతుంది.

గాయపడ్డ సినర్జిన్ ఫార్మా కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పరవాడ (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని సినర్జిన్ ఫార్మా కంపెనీలో గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడిన ఓబెన్ కోహ (22) విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. సినర్జిన్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ కెమికల్ లీకవడంతో మంటల వ్యాపించి నలుగురు గాయపడిన విషయం తెలిసిందే. వీరిలో ప్రస్తుతం ముగ్గురు విశాఖలో చికిత్స పొందుతున్నారు. ఓబెన్ కోహ జార్ఖండ్‌కు చెందినవారు. ప్రమాదంలో 90 శాతం గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, కోశాధికారి వివి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.



ఆలయం బయట 'సరిపోదా శనివారం' చిత్ర బృందం

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. విఐపి బ్రేక్ దర్శనంలో శ్రీవారిని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, పంచాయతీరాజ్ సెక్రటరీ కష్ణ తేజ, జెడి లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. శనివారం వేకువజామున అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన సినీ హీరో నాని, హీరోయిన్ ప్రియాంక మోహన్ తిరుమల చేరుకున్నారు. విఐపి బ్రేక్ దర్శనంలో స్వామి వారిని వారు దర్శించుకున్నారు. 'సరిపోదా శనివారం' సినిమా త్వరలో విడుదల అవుతున్నందున చిత్ర బృందం శ్రీవారిని దర్శించుకుంది.

విఐపి విరామ సమయంలో హీరో రాఘవ లారెన్స్ కుటుంబ సమేతంగా స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వెలుపల మీడియాతో ఆయన మాట్లాడుతూ... బుల్లెట్ అనే సినిమాలో తాను గెస్ట్ రోల్ చేస్తున్నానని తెలిపారు. మాత్రాం సోషియల్ కమ్యూనిటీ ప్రారంభించానని.. దాని ద్వారా సేవ చేస్తున్నానని వెల్లడించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

350 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

వ్యాన్‌లో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న 350 కిలోల గంజాయిని అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు వివరాలను చింతూరు అడిషనల్ ఎస్‌పి పంకజ్ కుమార్ మీనా శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మోతుగూడెం పోలీస్ స్టేషన్ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని వ్యానులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద ఉన్న వంద గ్రాముల లిక్విడ్ గంజాయిని సైతం స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని కుర్మనూరుకు చెందిన రెడ్డి వద్ద మహారాష్ట్రకు చెందిన అన్సార్ అలీ సయ్యద్, యూనుస్ ముస్తాఫ్ షేక్‌లు గంజాయి కొని మోతుగూడెం గ్రామ శివారులోని అడవిలో లోడ్ చేసి మహారాష్ట్రలోని లాతూర్‌కు తరలిస్తుండగా పట్టుకున్నట్టు ఎస్‌పి తెలిపారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన రెడ్డి, మహారాష్ట్రకు చెందిన సంతోష్ పరారీలో ఉన్నట్టు చెప్పారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.17.60 లక్షలు ఉంటుందని తెలిపారు.

బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లాపై కేసు

- బఫర్ జోన్‌లో అనురాగ్ విద్యాసంస్థలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కేసు నమోదైంది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్ మండలం, వెంకటాపూర్ పంచాయతీ, కొర్రెముల రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 813లోని నాడెం చెరువు బఫర్ జోన్ పరిధిలో ఉంది. ఆ ప్రాంతంలో ఎమ్మెల్యేకు చెందిన అనురాగ్ విద్యాసంస్థలు, గాయత్రీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పలు నిర్మాణాలు చేపట్టాయని మండల ఇఇ పరమేష్ ఈ నెల 22న పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ అభ్యంతరకరం

- మత విభజన సృష్టించి ఓట్లు పొందాలన్నది బిజెపి దుర్బుద్ధి
- కమ్యూనల్ సివిల్ కోడ్ అంటూ రెచ్చగొడుతున్న ప్రధాని
- అగ్రిస్టాక్‌తో రైతులకు తీవ్రనష్టం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వక్ఫ్‌బోర్డు చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించి, మార్పులు చేయాలనుకోవడం అభ్యంతరకరమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిస్తున్నాననే సోయ లేకుండా ప్రధాని మోడీ దూకుడుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై జాతినుద్దేశించి చేసిన ప్రసంగమే అందుకు నిదర్శనమన్నారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం, రాష్ట్ర కమిటీ సమావేశాలకు హాజరైన బివి రాఘవులు శనివారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్యతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఒక మతంలో ఇంకో మతస్తులుండొద్దంటూ చెబుతున్న బిజెపి నేతలు.. వక్ఫ్‌బోర్డులో మాత్రం ఇతర మతస్తులను చేర్చి నియంత్రించాలని చూస్తున్నారని అన్నారు. ఈ ద్వంద్వ ప్రమాణాలేంటని ప్రశ్నించారు. దయాదాక్షిణ్యాలతో ఇచ్చిన భూములను నియంత్రించడమే వక్ఫ్‌బోర్డు పని అని చెప్పారు. వాటి మీద ప్రభుత్వం పెత్తనానికి పూనుకోవడం న్యాయం కాదన్నారు. హర్యానా, జమ్మూకాశ్మీర్, మహారాష్ట్ర, జార్ఖండ్‌లో ఎన్నికలు జరుగుతున్నాయనీ, దుర్బుద్ధితో మత విభజనను సృష్టించి ఓట్లు పొందాలని బిజెపి చూస్తున్నదని విమర్శించారు.

ప్రధాని హోదాకు తగదు

యూనిఫామ్ సివిల్ కోడ్, కామన్ సివిల్ కోడ్‌లో లోపాలుంటే సవరించుకోవచ్చనీ, దానికి కమ్యూనల్ సివిల్ కోడ్‌గా మారుపేరు పెట్టి ప్రధాని మోడీ మత దురభిప్రాయాన్ని రెచ్చగొడుతున్నారని అన్నారు. ఇది ప్రధాని హోదాకు తగదని హితవు పలికారు. దేశాన్ని ఐక్యంగా ఉంచాల్సిన వ్యక్తి చీలికలు తెస్తున్నారని విమర్శించారు. యూనిఫామ్ సివిల్ కోడ్‌ను మారుస్తామంటున్నారనీ, ఉత్తరాఖండ్‌లో మార్చారనీ, అనేక పరిణామాలు జరిగాయని వివరించారు. అన్ని మతాల్లో పురుషాధిక్యత కొనసాగుతున్నదనీ, దాన్ని తగ్గించాలని కోరారు. వివిధ మతాల్లో మహిళలకు సమాన అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే మహిళలు, మైనార్టీలకు మేలు జరగబోదని అన్నారు. స్వార్థపూరిత, ఓట్ల రాజకీయాల కోసం మతాన్ని ఓ సాధనంగా వాడుకోవడాన్ని తీవ్రంగా వ్యవరేకిస్తున్నామని చెప్పారు.

బహుళజాతి సంస్థల లాభం కోసమే అగ్రిస్టాక్

మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్టు భూ యజమానులకు గుర్తింపు కార్డులను ఇచ్చి భూములను కేంద్రం డిజిటలైజేషన్ చేసేందుకు అగ్రిస్టాక్ తీసుకొస్తున్నారని రాఘవులు అన్నారు. దీంతో ఎవరైనా భూముల వివరాలను తెలుసుకోవచ్చని వివరించారు. ఇప్పటి వరకు రైతులు, భూముల వివరాలు గోప్యంగా ఉన్నాయని గుర్తు చేశారు. అగ్రిస్టాక్ వస్తే గోప్యత ఉండబోదనీ, బహుళజాతి కార్పొరేట్ సంస్థలు, పురుగు మందులు, విత్తనాల సంస్థలకు ఆ వివరాలు చేరుతాయని అన్నారు. ఆ సంస్థల లాభం కోసమే అగ్రిస్టాక్‌ను రూపొందిస్తున్నారని విమర్శించారు. భూమి ఉన్న వారికి కంక్లూజివ్ గ్యారెంటీ టైటిల్‌ను ఇస్తామంటున్నారని చెప్పారు. కంప్యూటర్‌లోనే భూముల అమ్మకాలు, కొనుగోళ్లను పెంచడం కోసం ఇది ఉపయోగపడుతుందన్నారు. పేదలు అమ్ముతారనీ, పెద్దలు కొంటారని వివరించారు. దీని ద్వారా కాంట్రాక్టు వ్యవసాయం, కార్పొరేట్ వ్యవసాయం వస్తుందన్నారు. మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసినా, పరోక్షంగా కేంద్రం అమలు చేసే కుట్రలో భాగమే అగ్రిస్టాక్ అని తెలిపారు. కేంద్రం ఒత్తిడి మేరకే ఆంధ్రలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను జగన్ తెచ్చారనీ, తెలంగాణలో కెసిఆర్ ధరణి అమలు చేశారని గుర్తు చేశారు. దీనివల్ల చాలా సమస్యలొచ్చాయనీ, ఎపిలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను చంద్రబాబు రద్దు చేశారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూమాత పేరుతో కొత్త చట్టం తీసుకొచ్చినా చిన్న, సన్నకారు రైతులకు, దళితులు, గిరిజనులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



కంపెనీలో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

ఎసెన్షియా పరిశ్రమలో కేంద్ర మంత్రి పర్యటన

ప్రజాశక్తి- అచ్యుతాపురం (అనకాపల్లి)

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో శనివారం రాత్రి కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పర్యటించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరా మర్శించారు. ఆయన వెంట యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, అగ్గాల హనుమంతరావు ఉన్నారు. కాగా, ఈ కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదంలో 18 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

ఆరునెలలుగా అందని వేతనం

- కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఆరు నెలలుగా వేతనం అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్స్ మీరా భాను శనివారం మధ్యాహ్నం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తోటి సిబ్బంది గమనించి ఆమెను వెంటనే ఆస్పతిలో చేర్పించారు. ఒకవైపు పిల్లల స్కూల్ ఫీజులు, మరోవైపు రూమ్‌రెంట్లు కట్టాల్సి రావడం, ఆరు నెలలుగా ఎటువంటి ఆర్థిక మొత్తమూ చిక్కకపోవడం, అప్పు చేద్దామన్నా దొరకకపోవడంతో గత్యంతరం లేక మానసికంగా కుంగిపోయి ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భర్త కరోనా వల్ల చనిపోవడంతో తన ఒక్క సంపాదనతోనే కుటుంబాన్ని నడిపిస్తున్నారు. మీరాభానును మెడికల్ ఉద్యోగుల సంఘం నాయకులు శెట్టి నాగరాజు, లక్ష్మణరావు, సిఐటియు నాయకులు సుందరరావు, ఎఐటియుసి నాయకులు అమర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులందరినీ రెండు మూడు దఫాలుగా మీరాభాను కలిసినా ఆమె వేతన సమస్య పరిష్కారం కాలేదన్నారు.

విద్యార్థులదే భవిష్యత్తు

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ
- వేడుకగా విజ్ఞాన్ వర్సిటీ 12వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నైపుణ్యం కలిగిన యువత కోసం ప్రపంచం ఎదురుచూస్తోందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ అన్నారు. గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రాంగణంలో శనివారం సాయంత్రం నిర్వహించిన 12వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎస్‌ఇసి ఇండస్ట్రీస్ ఫౌండర్ అండ్ చైర్మన్ దొంతినేని శేషగిరిరావు, హైదరాబాద్‌లోని లోకేష్ మెషీన్స్ ఫౌండర్ ముల్లపూడి లోకేశ్వరరావు, ఇండియన్ కంపోజర్ అండ్ సింగర్ సాలూరి కోటేశ్వరరావు (కోటి)లకు గౌరవ డాక్టరేట్లు, 1539 మంది విద్యార్థులకు డిగ్రీలు, 60 మందికి బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి నరసింహ మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలోని ప్రతి అంశం లోతైన విప్లవానికి లోనవుతోందన్నారు. ప్రతి మూలలో కొత్త ఆవిష్కరణలు వెళ్లానుకుంటున్నాయని, కొత్త ప్రపంచంలోకి అడుగుపెడుతున్నప్పుడు సమాజంలోని వివిధ రంగాలలో సంభవించే విశేషమైన మార్పులను మనం ఆస్వాదించాలని తెలిపారు. కొత్త అన్వేషణలకు భారతదేశమే మెరుగైన ప్రదేశమని అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు తమను తాము కొత్తగా ఆవిష్కరించుకోవాలని సూచించారు.



విద్యార్థులకు డాక్టరేట్‌లు అందజేస్తున్న జస్టిస్ శ్రీనరసింహ

యువ న్యాయవాదులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

వృత్తిలో రాణించాలంటే యువ న్యాయవాదులు కష్టపడటంతోపాటు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి పిఎస్ నరసింహ అన్నారు. గుంటూరు బార్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్లో న్యాయవాదులు, న్యాయ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. సమాజంలో శాంతిని నెలకొల్పటం న్యాయవాది విధి అని తెలిపారు.



వికసిత్ ఎపి కోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వికసిత్ ఎపి విజన్ 2047లో భాగంగా శాసనసభ్యులకు అవగాహన కల్పించేందుకు అక్టోబర్‌లో ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. అలాగే గాంధీ జయంతి రోజున వికసిత్ ఎపి విజన్ 2047ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగానే ముందుగా 2024-29 మధ్య కాలంలో వికసిత్ ఆంధ్రా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే కొద్ది రోజుల క్రితం జిల్లాల ముఖ్య ప్రణాళికాధికారులకు శిక్షణ ఇవ్వగా, మంత్రులు, పార్లమెంట్ సభ్యులకు కూడా కొద్ది రోజుల్లోనే శిక్షణ ఇవ్వనున్నారు. ఇదే సమయంలో అక్టోబర్ ఐదో తేదీ నుంచి 10వ తేదీ మధ్య కాలంలో శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. సూచన ప్రాయంగా ఈ తేదీలను ఖరారు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సమావేశాల్లోనే వార్షిక పూర్తిస్థాయి బడ్జెట్‌ను కూడా ఆమోదించుకునే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. వాస్తవానికి నవంబర్ నెలాఖరులోగా బడ్జెట్‌ను ఆమోదించుకునేందుకు సమయం ఉన్నప్పటికీ అక్టోబర్‌లోనే బడ్జెట్ ప్రవేశపెట్టి అదే సమయంలో విజన్ అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

ఆపరేషన్ 'గుజరాత్ సైబర్' సక్సెస్

- సైబర్ నేరగాళ్లకు హైదరాబాద్ పోలీసుల భారీ షాక్
- దేశంలో 983 కేసుల్లో మోస్ట్ వాంటెడ్ నేరగాళ్ల అరెస్ట్
- మిస్టరీ వీడిన 20 కేసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సైబర్‌క్రైమ్ పోలీసులు చేపట్టిన ఆపరేషన్ 'గుజరాత్ సైబర్' విజయవంతమైంది. 983 కేసుల్లో మోస్ట్ వాంటెండ్ గుజరాత్ జాదూలను అరెస్టు చేశారు. ఏడు బృందాలతో గుజరాత్‌లో కీలక ఆపరేషన్ చేశారు. చార్టెడ్ అకౌంటెంట్ సహా 36 మంది సైబర్ నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ఏడుగురు దేశవ్యాప్తంగా పలు కేసుల్లో కీలక నిందితులుగా ఉన్నట్టు హైదరాబాద్ సిపి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పెట్టుబడుల పేరుతో మోసాల్లో 11 మంది, ట్రేడింగ్ మోసంలో నలుగురు, కెవైసి మోసంలో ఒకరిని అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితులపై దేశవ్యాప్తంగా 983 కేసులు ఉన్నట్టు గుర్తించామన్నారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పాత పోలీస్ కమిషనరేట్‌లో విలేకరుల సమావేశంలో సిపి వివరాలు వెల్లడించారు.

గుజరాత్‌కు చెందిన సాగర్ గోరధన్ ప్రజాపతి, పర్మార్ కిరీట్ నాథుభాయ్, కనాని నికుంజ్ కిషోర్ భాయ్, ప్రవీణ్ కాళుభాయ్, చూడాసమా కులదీప్ సిన్హ్ జెడేజా దైవత్, సినోజియా కేతన్ సురేశ్ భాయ్‌తోపాటు మరికొంత మందితో కలిసి అంతర్రాష్ట్ర ముఠాగా ఏర్పడ్డారు. పెట్టుబడులు, ట్రేడింగ్, కెవైసి, రుణాలిప్పిస్తామని వివిధ రకాల మోసాలతో అమాయకులను నమ్మించి రూ. కోట్లకు కోట్లు దోచుకున్నారు. ఈ క్రమంలో వారిని పట్టుకునేందుకు సైబర్ క్రైమ్ డిసిపి కవిత నేతృత్వంలో గుజరాత్ ఆపరేషన్ మొదలు పెట్టారు. ఈ బృందంలో ఎసిపిలు శివమారుతి, చాంద్‌పాషా, ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, కె.మధుసూధన్‌రావు, పివిఎస్ అభిషేక్, మన్మోహన్, కె.సతీష్ రెడ్డి, సిబ్బంది పివి శ్రీనివాస్, భాస్కర్, సతీష్, కాంతికుమార్ భాస్కర్, బి.సందీప్, సంపత్ ఉన్నారు. చివరకు 36 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై హైదరాబాద్ పరిధిలో 20 కేసులు ఉన్నాయి. నిందితుల నుంచి రూ.40 లక్షలు, 27 బ్యాంక్ ఖాతా పాస్ బుక్‌లు, 40 డెబిట్ కార్డులు, 226 బ్యాంకు చెక్కులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ చేపట్టిన సైబర్ క్రైమ్ పోలీసులను కమిషనర్, సిసిఎస్ డిసిపి శ్వేతారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

అప్రమత్తంగా ఉండాలి: కొత్వాల్ శ్రీనివాస్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాట్సప్, ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలను చూసి నమ్మొద్దని సిపి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులతో మాట్లాడొద్దని, ముఖ్యంగా చాటింగ్‌లు చేయొద్దని సూచించారు. వెబ్‌సైట్ల ద్వారా పెట్టుబడి పెట్టొద్దన్నారు. ఇంట్లో కూర్చొని తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టడం ద్వారా అధిక రాబడులు వస్తాయని సైబర్ నేరస్థులు చెప్పేమాటలను నమ్మొద్దన్నారు.

రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని సిబిఐ డైరెక్టర్‌ను కోరాం

మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ దర్యాప్తు కొనసాగుతోందని సిపి వెల్లడించారు. కేసులో కీలక నిందితులను ఇప్పటికే అరెస్టు చేశామన్నారు. ఎస్‌ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, శ్రవణ్ రావుపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని సిబిఐ డైరెక్టర్‌ను కోరామన్నారు. సిబిఐ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసిన తర్వాత వారిని దేశానికి తీసుకొస్తామన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసుతో సంబంధమున్న వారందర్నీ విచారిస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ నిలిపివేయండి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు లొంగి రాష్ట్రంలోని నివాస గహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టాలని గత వైసిపి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అదానీ, షిరిడి సాయి తదితర కంపెనీలకు వాటి పంపిణీ కాంట్రాక్టులను కట్టబెట్టిందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టులో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని తెలిపారు. తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉండగా ఈ మీటర్లను వ్యతిరేకించి, హైకోర్టులో పిటీషన్లు కూడా వేసిన విషయాన్ని గుర్తుచేశారు. నేడు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగించడం ఏమిటని ప్రశ్నించారు. విజయవాడతో సహా పలు ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను తెచ్చి విద్యుత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు, ప్రభుత్వ కార్యాలయాలలోను ఈ మీటర్లు బిగిస్తున్నారని, ఆ తర్వాత నివాస గహాలకు మీటర్లు బిగించే ప్రక్రియకు సిద్ధమవుతున్నారని తెలిపారు. మొదటి దశలో వ్యవసాయం పంపసెట్లకు మీటర్ల పేరుతో క్రమంగా ఉచిత విద్యుత్తుకు ఎసరుపెట్టే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. నివాస గహాలకు మీటర్లతో ప్రీపెయిడ్‌లో విద్యుత్ వాడే సమయాన్నిబట్టి అదనపు చార్జీలు, మీటర్ల ఖర్చును వినియోగదారులపై వివిధ రూపాల్లో భారం వేస్తారని తెలిపారు. వేలాదికోట్ల రూపాయల ప్రజాధనం మీటర్ల పేరుతో దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మాట తప్పి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయిందని విమర్శించారు. గతంలో వ్యతిరేకించిన స్మార్ట్ మీటర్ల ఇప్పుడు కొనసాగించడం వాగ్దాన భంగమే అవుతుందని తెలిపారు. బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతోనే కేంద్రం ఈ స్మార్ట్ మీటర్లను రుద్దుతోందన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు, నివాస గహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆదాని, షిర్డీ సాయి తదితర కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, ఇప్పటికే బిగించిన మీటర్లను తొలగించాలని కోరారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ సుబ్బారావు

బాపట్ల కేంద్రీయ విద్యార్థులకు అస్వస్థత

- 21 మందికి వాంతులు
- గుర్తుతెలియని పౌడర్ మిశ్రమాన్ని పీల్చిన వైనం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా , అమరావతి బ్యూరో

బాపట్ల సూర్యలంక కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి విద్యార్థులు గుర్తుతెలియని పౌడరు మిశ్రమాన్ని పీల్చడంతో అస్వస్థతకు గురైన విషయం సంచలనం రేపింది. ఎవరికి ప్రాణాపాయం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బాధిత విద్యార్థులు చెప్పిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా సూర్యలంక కేంద్రీయ విద్యాలయంలో గుర్తు తెలియని పౌడరు వాసన పీల్చిన కారణంగా ఆరో తరగతికి చెందిన 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. చీరాల ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని టిష్యూ పేపరులో లెమన్, సాల్ట్, కాఫీపొడి మరికొన్ని మిశ్రమాలను కలిపి తరగతి గదిలోకి తీసుకువచ్చారు. భోజన విరామ సమయంలో ఆ మిశ్రమాన్ని పీల్చమని తోటి విద్యార్థులకు చెప్పారు. దీన్ని వరుసగా పీల్చిన విద్యార్థులు ఊపిరి ఆడక, వాంతులతో ఇబ్బందులు పడ్డారు. సదరు మిశ్రమం ఉన్న టిష్యూ పేపరును మరో విద్యార్థి గాలిలోకి విసిరేయడంతో తరగతి గది అంతా ఈ మిశ్రమం గాలిలో కలిసిపోయింది. ఆ వాసన పీల్చిన విద్యార్థులందరూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్థానిక ఎయిర్‌ఫోర్సు వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చికిత్స అందించారు. వారిని జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు పరామర్శించారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రి ఆరా

బాపట్ల కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరా తీశారు. పిల్లల ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పూర్తిగా కోలుకునే వరకు వైద్యుల పర్యవేక్షణలోనే ఉంచాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ల్యాబ్‌లో రసాయనాల ప్రయోగాలు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదకర వాయువులు విడుదల కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని సిఎంకు అధికారులు వివరించారు. విద్యార్థులకు ప్రాణాపాయం లేదని తెలియజేశారు.

బుల్డోజర్లతో ఇళ్ల కూల్చివేత ఆందోళనకరం

- మల్లికార్జునఖర్గే, ప్రియాంకగాంధీ

న్యూఢిల్లీ : మైనారిటీలను బిజెపి లక్ష్యంగా చేసుకుంటోందని, బుల్డోజర్లతో వారి ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. శనివారం ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఒకరి ఇంటిని కూల్చివేయడం. వారి కుటుంబాన్ని నిరాశ్రయులను చేయడం అమానవీయం, అన్యాయం. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మైనారిటీలపై పదే పదే దాడులు జరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రూల్ ఆఫ్ లా ప్రకారం పరిపాలించే సమాజంలో ఇలాంటి చర్యలకు చోటు లేదు. పౌరులలో భయాన్ని కలిగించడానికి బుల్డోజింగ్‌ను ఉపయోగించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుంది. అరాచకం సహజ న్యాయాన్ని భర్తీ చేయదు. నేరాలపై కోర్టులు తీర్పులిస్తాయి. ప్రభుత్వం ప్రాయోజిత బలవంతం ద్వారా కాదు' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. భోపాల్‌లో పోలీసు అధికారులను లక్ష్యంగా చేసుకుని రాళ్లదాడికి పాల్పడిన ఘటనలో నిందితుడైన కాంగ్రెస్ నేత హాజీ షెహజాద్ అలీ బంగ్లాను అధికారులు ఇటీవల కూల్చేసిన నేపథ్యంలో ఖర్గే ఈ మేరకు స్పందించారు.

బుల్డోజర్ న్యాయం ఆమోదయోగ్యం కాదు : ప్రియాంకగాంధీ

మధ్యప్రదేశ్‌లోని చత్తార్‌లో నిరసనలో పాల్గొన్న వ్యక్తి ఇంటిని కూల్చివేయడం ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆమె పోస్ట్ చేశారు. 'నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి నేరం చేస్తే కోర్టు వారిని శిక్షిస్తుంది. అతనిని శిక్షించడం, వారి ఇంటిని కూల్చివేయడం అంటే చట్టాన్ని పాటించకపోవడమే. ప్రభుత్వాలు నేరస్థుల్లా ప్రవర్తించకూడదు. బుల్డోజర్‌తో న్యాయం చేయడం ఆమోదయోగ్యం కాదు. కూల్చివేతలు వెంటనే ఆపేయాలి' అని ఆమె పేర్కొన్నారు.

నింగిలోకి దూసుకెళ్లిన రీ యూజబుల్ రాకెట్ రూమీ-1

చెన్నై : చెన్నైలోని ఇసిఆర్‌లో తిరువిడంద్తై తీర గ్రామం నుంచి 'రూమీ-1' అనే చిన్న రాకెట్ శనివారం ఉదయం నింగిలోకి దూసుకెళ్లింది. స్పేస్‌జోన్ ఇండియా సంస్థ తయారుచేసిన ఈ రాకెట్ శకలాలను సేకరించి తిరిగి వినియోగించుకోనున్నారు. దాదాపు 80 కిలోల బరువున్న ఈ రాకెట్‌ను హైడ్రాలిక్ మొబైల్ కంటైనర్ లాంచ్‌పాడ్‌పై నుంచి ప్రయోగించారు. ఇది కిలోకన్నా తక్కువ బరువున్న మూడు క్యూబ్ ఉపగ్రహాలు, 50 పికో శాటిలైట్లను మోసుకుని ఉప కక్ష్య పథంలోకి దూసుకెళ్లింది. వాతావరణ పరిస్థితులు, కాస్మిక్ రేడియేషన్, యూవీ రేడియేషన్, గాలి నాణ్యత, తదితరాల్ని క్యూబ్ ఉపగ్రహాలు సేకరించనున్నాయి. నింగిలో కంపనస్థాయి, ఓజోన్ పొర పరిస్థితిని, ఇతర పర్యావరణ పరిస్థితుల్ని పికో ఉపగ్రహాలు గుర్తించనున్నాయి.

సాంకేతికత - ప్రయోగ ఖర్చు తగ్గుదల : స్పేస్‌జోన్ ఇండియా సిఇఒ ఆనంద్ మేఘలింగం

కంటైనర్ తరహా మొబైల్ లాంచ్‌పాడ్ నుంచి ప్రయోగించిన తర్వాత భూఉప కక్ష్యలోకి ఉపగ్రహాలు వెళ్లేలా రాకెట్ పైకెళ్లింది. అక్కడికి వెళ్లేలోపు శకలాలు తిరిగి భూమికి చేరేలా రాకెట్‌లోనే పారాచూట్లను ఉంచారు. నిర్ణీత దూరం వరకు వెళ్లాక.. శకలాలు కిందకు జారి, భూమికి కొంత ఎత్తుకు చేరేసరికి పారాచూట్లు తెరచుకొని సురక్షితంగా దిగడం దీని సాంకేతికత. సెన్సార్ల సాయంతో ఆ శకలాల్ని సేకరించి తిరిగి మరో రాకెట్ వినియోగానికి వాడతారు. తద్వారా ప్రయోగ ఖర్చు బాగా తగ్గుతుందని స్పేస్‌జోన్ ఇండియా సిఇఒ ఆనంద్ మేఘలింగం గతంలో తెలిపారు.

ప్రకాశం బ్యారేజీకి మళ్లీ వరద

- 35 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి 35,270 క్యూసెక్కుల నీరు వస్తుండగా అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.2.4 అడుగుల మేరకు నీటి నిల్వ ఉంది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసిలకు గాను 310.85 టిఎంసిల నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. పులిచింతల గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసిలు కాగా ప్రస్తుతం 45.62 టిఎంసిలు నమోదైంది. ప్రస్తుతం సాగర్ కుడి, ఎడమ కాల్వలకు, ప్రకాశం బ్యారేజీ నుంచి డెల్టా కాల్వలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

చంద్రబాబును కలిసిన మందకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ కలిశారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో శనివారం ఈ సమావేశం జరిగింది. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన్నట్లు టిడిపి కార్యాలయం వెల్లడించింది. ఎస్సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు అమలుపై వీరిద్దరి మధ్య చర్చ జరిగిన్నట్లు సమాచారం.



పిన్నెల్లికి స్వాగతం పలుకుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

జైలు నుంచి 'పిన్నెల్లి' విడుదల

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. ఇవిఎంలను ధ్వంసం చేసిన కేసులో గుంటూరు కోర్టు ఆయనకు జూన్ 26న జైలు శిక్ష విధించింది. అక్కడి నుంచి నెల్లూరు సెంటర్ జైలుకు తరలించారు. దాదాపు రెండు నెలల పాటు ఆయన జైలు జీవితం గడిపారు. జైలు నుంచి బయటకు వచ్చిన పిన్నెల్లికి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వాగతం పలికారు. మాజీ మంత్రి పి. అనిల్‌కుమార్ స్వాగతం పలికి తన కారులో తీసుకెళ్లారు. చెన్నై వెళ్లి అక్కడి నుంచి బెంగళూరు వెళ్లారని సమాచారం.

కిడ్నీ మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత

- ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-ఎ.కొండూరు, విజయవాడ (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరులో సంభవిస్తున్న కిడ్నీ మరణాలు ప్రభుత్వ హత్యలేనని, వీటికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. ఎ.కొండూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని వివిధ గ్రామాలు, గిరిజన తండాలకు చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తులు సిపిఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎ.కొండూరు మండలంలో గడిచిన పదేళ్లలో ఇప్పటి వరకు 500 మంది మృతి చెందారని తెలిపారు. ప్రస్తుతం వెయ్యి మంది కిడ్నీ వ్యాధులతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. వైద్య ఖర్చుల కోసం ఉన్న భూములను సైతం అమ్ముకుని నిరాశ్రయులుగా మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ప్రతిరోజూ కిడ్నీ రోగుల మరణాలు సంభవిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. వీధి వీధినా బెల్టు షాపుల ద్వారా మద్యం అందిస్తున్న ప్రభుత్వం కిడ్నీ రోగులకు మంచినీరు సరఫరా చేయలేకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధులతో మరణించిన వారికి కనీసం మట్టి ఖర్చులు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇంటి ఇంటికి వెళ్లి ఓట్లు వేయించుకొని.. గెలిచాక ప్రజల గురించి పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.



కిడ్నీ బాధితులతో కలిసి ధర్నా చేస్తున్న బాబూరావు

డయాలసిస్ చేయించుకుంటున్న వారికి గతంలో సిపిఎం ఆందోళన వల్లే రూ.పది వేలు పింఛను అందిస్తున్నారని, తిరువూరు, ఎ.కొండూరులో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు.

ప్రభుత్వం చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్ తరాలకు ముప్పు పొంచి ఉందన్నారు. ముఖ్యమంత్రి స్పందించి ఈ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించాలని, ప్రతి ఇంటికి కృష్ణా జలాలను అందించాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే ప్రభుత్వ కార్యాలయాలను నిర్బంధిస్తామని హెచ్చరించారు. సిపిఎం ఎ.కొండూరు మండలం కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రప్రసాద్, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, కోట కల్యాణ్, పివి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల సంఘం నేత నరసింహారావు మృతి

ప్రజాశక్తి-గుంటూరు

పౌర హక్కుల సంఘం నాయకులు, ప్రముఖ చరిత్ర అధ్యాపకులు ఎన్.వి.నరసింహారావు (86) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. గుంటూరులోని నరసింహారావు కుమార్తె నివాసంలో ఆయన భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, విరసం నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్, చరిత్ర కాంగ్రెస్ నాయకులు యం.సోమశేఖర్‌రావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు సందర్శించి నివాళి అర్పించారు. నరసింహారావు విద్యార్థి ఉద్యమాలలో పనిచేసి, కమ్యూనిజంవైపు ఆకర్షితులయ్యారు. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ ఎపిఎన్‌జిఒ అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించారు. తర్వాత చరిత్ర అధ్యాపకుడిగా పనిచేసి చరిత్ర పట్ల ఆసక్తి పెంచటానికి కృషి చేశారు. గుంటూరు జిల్లా చరిత్ర కాంగ్రెస్‌ను స్థాపించి గత 30 సంవత్సరాలుగా చరిత్ర అధ్యయనం ప్రాముఖ్యతను ప్రచారం చేశారు. గుంటూరు జిల్లా చరిత్ర-సంస్కృతి పేరుతో రెండు వాల్యూమ్స్ ప్రచురించారు. గుంటూరు జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షులుగా పని చేశారు. ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ రిటైర్డ్ ఒఎస్‌డి శామ్యూల్, హైకోర్టు అడ్వకేట్ నర్రా శ్రీనివాసరావు, ఎపిసిఎల్‌సి నాయకులు చిలకా చంద్రశేఖర్, సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పి.నాగరాజు తదితరులు పాల్గొని నివాళి అర్పించారు. గుంటూరులోని కొరిటెపాటు మహాప్రస్థానంలో శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.



నివాళులర్పిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు
ఇన్‌సెట్‌లో నరసింహారావు (ఫైల్)

ఫార్మా ప్రమాద మృతులకు వైసిపి ఆర్థిక సాయం

- ఎమ్మెల్సీ బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఈ నెల 21న ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారికి వైసిపి తరుపున రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తెలిపారు. విశాఖలోని లాసన్స్‌బే కాలనీలోని తన కార్యాలయంలో ఆయన శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఫార్మా ప్రమాద దుర్ఘటనపై టిడిపి కూటమి శవ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. సంఘటన జరిగిన రోజు రాత్రి కూటమి నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు సరిగా స్పందించలేదని అన్నారు. జిల్లా యంత్రాంగం ద్వారా కాల్ సెంటర్, హెల్ప్ డెస్క్ వంటివి ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ప్రమాద ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. వైసిపి డిమాండ్ తరువాతనే ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం ప్రకటించిందని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో సేఫ్టీ ఆడిట్ కోసం 2021లోనే ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు గుడివాడ అమర్‌నాథ్, కన్నబాబు, కరణం ధర్మశ్రీ, కోలా గురువులు పాల్గొన్నారు.

30న వనమహోత్సవం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30వ తేదిన జరిగే వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కోరారు. ఇందులో ప్రజలు, ముఖ్యంగా యువత భాగస్వామ్యాన్ని పెంచాలని అధికారులకు తెలిపారు. నగరవనాల అభివృద్ధిపై శనివారం అటవీశాఖ అధికారులతో చర్చించారు. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో నగర వనాలు అభివృద్ధికి కేంద్రప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఆమోదం తెలియజేసిందని తెలిపారు. కేంద్రం నుంచి వస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించే అవకాశాలు లభించాయని వెల్లడించారు. రాష్ట్రంలో పచ్చదనం 50శాతం మేరకు ఉండాలని, ఇందులో భాగంగా నగర వనాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. 11 మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాల్టీల పరిధిలో నూతనంగా నగర వనాల అభివృద్ధి నిమిత్తం తొలివిడతగా రూ.15.4కోట్లను కేంద్ర పర్యావరణ, అటవీశాఖ నిధులను మంజూరు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 50 నగర వనాల అభివృద్ధికి వేగంగా పనులు సాగుతున్నాయని, వీటిల్లో 30 వనాల పనులు 100 రోజుల్లో పూర్తికావస్తాయని అధికారులు వివరించారు.

ప్రమాదాలు పునరావృతం కారాదు

- సేఫ్టీ ఆడిట్ నిర్వహించండి
- భద్రతా చర్యలు తీసుకోవాలి
- పరిశ్రమల యాజమాన్యాలతో హోం శాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సేఫ్టీ ఆడిట్ నిర్వహించి లోపాలను సరిచేసుకోవాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. ఫార్మా, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాద రహిత పారిశ్రామిక కేంద్రంగా గుర్తింపు పొందేలా ప్రయత్నం చేయాలని సూచించారు. పరిశ్రమల భద్రతపై అనకాపల్లిలోని ఎస్ఆర్.శంకరన్ భవన్‌లో పరిశ్రమల యజమానులు, అధికారులతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫైర్, గ్యాస్ లీకైనప్పుడు అప్రమత్తం చేసే అలార్మింగ్ వ్యవస్థ పనిచేసేలా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పైపులైన్ బాగాలేదని తెలియజేసినా ఎసెన్షియా యాజమాన్యం పట్టించుకోలేదని తెలిపారు. ఆ నిర్లక్ష్యమే కంపెనీలో 17 మంది మరణానికి దారితీసిందన్నారు. తక్కువ జీతాలకు నైపుణ్యంలేని కార్మికులతో పనిచేయించడం కూడా ప్రమాదాలకు దారితీస్తోందని వివరించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు సురక్షితంగా బయటపడే నైపుణ్యాలను మాక్‌డ్రిల్ ద్వారా మెళకువలు నేర్పించాలని సూచించారు. కొన్ని పరిశ్రమల్లో వెంటిలేషన్ కూడా సరిగాలేదని అసహనం వ్యక్తం చేశారు. పరిశ్రమల ప్రాంతాల్లోని స్టేషన్లలో పోలీసులను పెంచనున్నట్లు తెలిపారు. అనకాపల్లి ఎంపి సిఎం రమేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ పరిశ్రమల భద్రత సలహాదారులను సంప్రదించి భద్రతా ప్రమాణాల అమలుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ ఇండస్ట్రియల్ సేఫ్టీ ప్రొటోకాల్‌ను అమలు చేయడం ద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చని తెలిపారు. ప్రమాద సమయాల్లోనే కాకుండా సాధారణ రోజుల్లోనూ భద్రత అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్, జెఎన్‌పిసి మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ కార్యదర్శి జె.సుబ్బారావు, అచ్యుతాపురం సెజ్ అసోసియేషన్ అధ్యక్షులు మన్యప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్, ఎస్‌పి దీపిక, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి అనిత

పరిశ్రమల తనిఖీ అధికారిపై అనిత అసహనం

'మీ తెలివి తేటలు ఇక్కడ కాదు. పూర్తి సమాచారంతో ఇక్కడకొచ్చి కూర్చొన్నా. బ్రాండిక్స్‌లో ఎన్నిసార్లు తనిఖీ చేశారో చెప్పండి' అని జిల్లా పరిశ్రమల తనిఖీ అధికారి చిన్నారావుపై హోం శాఖ మంత్రి అనిత అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో పరిశ్రమల ప్రమాదాలను చిన్నారావు వివరిస్తుండగా మంత్రి అనిత జోక్యం చేసుకొని భద్రత పాటించని పరిశ్రమలపై ఏ చర్యలు తీసుకున్నారు? ఎన్ని పరిశ్రమల్లో తనిఖీలు చేశారు? భద్రతా ప్రమాణాలు పాటించేలా ప్రయత్నం ఎందుకు చేయడంలేదు? అని నిలదీశారు. ఎసెన్షియా ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని, పైపులైన్ బాగుచేసివుంటే ఈ ప్రమాదం జరిగేది కాదని అన్నారు. దీనిపై చిన్నారావు వివరణ ఇవ్వగా ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో 15 మంది ప్రాణాలు కాపాడిన అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు.

భారత వృద్ధి తగ్గొచ్చు..!

- గోల్డ్‌మాన్ సాచ్స్ అంచనా

న్యూఢిల్లీ : భారత వృద్ధి రేటు అంచనాలకు కోత పెడుతూ అంతర్జాతీయ బ్యాంకింగ్ దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ ప్రకటన చేసింది. ప్రస్తుత, వచ్చే ఏడాదిలో ముందుగా ఊహించిన దాని కంటే దేశ జిడిపి తగ్గొచ్చని విశ్లేషించింది. భారత వృద్ధి 2024లో 6.7 శాతంగా, వచ్చే ఏడాది 6.4 శాతానికి పరిమితం కావొచ్చని ఓ రిపోర్ట్‌లో తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ఖర్చులను తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం వల్ల జిడిపిపై ప్రతికూల ప్రభావం పడుతుందని గోల్డ్‌మాన్ సాచ్స్ ఆర్థికవేత్త సంతను సేన్‌గుప్తా వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికలు జరగడంతో ఈ ఏడాది మొత్తం ప్రభుత్వం పెట్టే ఖర్చు భారీగా తగ్గిందన్నారు.

35 లక్షల సెటాప్ బాక్స్‌లు ఇవ్వండి

- కేంద్రాన్ని కోరిన రాష్ట్రం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఎపిఎస్‌ఎఫ్‌ఎల్‌కు 35 లక్షల సెటాప్ బాక్స్‌లను సరఫరా చేయాలని రాష్ట్ర మౌలిక, పెట్టుబడుల శాఖ కార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ కోరారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్‌లను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 9.7 లక్షల కనెక్షన్‌లలో 5లక్షల కనెక్షన్‌లు యాక్టివ్‌గా వున్నాయని తెలిపారు.

నాడు వద్దని నేడు ఎలా అమలు చేస్తారు

- స్మార్ట్ మీటర్లపై సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలపై బారాలు పడేలా విద్యుత్ కనెక్షన్‌లకు స్మార్ట్ మీటర్లను నాడు వైసిపి ప్రభుత్వం తీసుకువస్తే తీవ్రంగా వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు వాటి అమలుకు పూనుకోవడం ఏమిటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రశ్నించారు. ఈ మేరకు కె రామకృష్ణ శనివారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలో వుంది జగన్‌ప్రభుత్వమా , చంద్రబాబు ప్రభుత్వమా తెలుగుదేశం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 1.5 కోట్ల విద్యుత్ కనెక్షన్‌లకు స్మార్ట్ మీటర్లను పెట్టేందుకు గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల మేరకు 27.68లక్షల స్మార్ట్ మీటర్లను అదాని రాష్ట్రానికి పంపితే రాష్ట్ర ప్రభుత్వం వాటిని స్వీకరించడం తగదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో తెలుగుదేశం ప్రభుత్వం గతంలో ఇచ్చిన వాగ్దానం మేరకు స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం

- రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేశ్ కుమార్ మీనా

ప్రజాశక్తి - విశాఖపట్నం, అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం అమలులో పారదర్శకంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేశ్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా అగనంపూడి వద్ద ఏర్పాటు చేసిన ఇసుక డిపోను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌తో కలిసి ఆయన శనివారం సందర్శించారు. అక్కడ అనుసరిస్తున్న విధానాలు, అవలంబిస్తున్న పద్ధతులను పరిశీలించారు. ఇసుక నిల్వలు, సరఫరా విధానం, బుకింగ్ ప్రక్రియ ఇతర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. లోడింగ్, బుకింగ్ వివరాల గురించి ఆరా తీశారు. అనంతరం పినమడక సచివాలయాన్ని సందర్శించి బుకింగ్ ప్రక్రియను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. బిల్ పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఇసుక సరఫరా సజావుగా నిర్వహించాలని, ఎలాంటి లోపాలూ తలెత్తకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం 58 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లు ప్రిన్సిపల్ సెక్రటరీకి జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ క్రమంలో ఇసుక కోసం వచ్చిన పౌరులతో ముకేశ్ కుమార్ మీనా మాట్లాడారు. పలు విషయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, మైన్స్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇసుక కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న ముకేశ్ కుమార్ మీనా

అదనపు రవాణా చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు

నిబంధనల ఉల్లంఘన, అక్రమ మైనింగ్, అదనపు రవాణా చార్జీల వసూలు వంటి వాటిపై జిల్లా కలెక్టర్లు కఠినంగా వ్యవహరించాలని గనులు, ఆబ్కారీశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్‌మీనా ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబరు 11న మరింత మెరుగైన నూతన ఆన్‌లైన్ విధానాన్ని ఆవిష్కరించనుండగా, ఆ విధానం అమల్లోకి వచ్చే వరకు వేచి చూడకుండా ఈ మూడు వారాలు కఠిన నిబంధనలనే అమలు చేయనున్నట్లు ముఖేష్‌కుమార్‌మీనా తెలిపారు. ఉచిత ఇసుక విధానంలో ఇబ్బందులను ఇ మెయిల్ ఐడి dmgapsandcomplaints@yahoo.com, టోల్ ఫ్రీ నెంబరు 1800-599-4599 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తప్పని సరిగా చర్య తీసుకుని,సంబంధిత వ్యక్తులకుఆయా జిల్లా కలెక్టర్ల కార్యాలయాల నుంచి తిరిగి సమాచారం అందిస్తారని తెలిపారు.



డెంగీతో తల్లీకుమార్తె మృతి

ప్రజాశక్తి-జియ్యమ్మవలస (పార్వతీపురం మన్యం జిల్లా)

డెంగీ జ్వరంతో తల్లీకుమార్తె మృతి చెందిన ఘటన పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం బిత్రపాడు పంచాయతీ బట్లభద్ర గ్రామంలో చోటు చేసుకుంది. ఇదే గ్రామంలో 15 రోజుల క్రితం మరో వ్యక్తి డెంగీతో మరణించారు. బట్లభద్ర గ్రామానికి చెందిన మేరువ పరంధామ భార్య మేరువ దుర్గ (47), కుమార్తె చైతన్య (20) డెంగీ జ్వరం బారిన పడ్డారు. కొద్దిరోజులుగా పార్వతీపురంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో దుర్గ చికిత్స పొందారు. జ్వరం తగ్గకపోవడంతో విజయనగరంలోని తిరుమల-మెడికవర్ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమించి శుక్రవారం వేకువజామున మరణించారు. కుమార్తె కూడా శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఒకేరోజు ఇద్దరూ మరణించడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన అల్లు వెంకట నాయుడు ఇటీవల డెంగీతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. డెంగీ మరణాల సమాచారం తెలుసుకున్న మాదలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తనూజ... బట్టభద్ర గ్రామ పాఠశాలలో మెడికల్ క్యాంప్ నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నారు.

సంపాదకీయం

తెలుగు వికాసం!

'సంస్కృతంబులోని చక్కెర పాకంబు/ అరవ భాషలోని అమృతరాశి/ కన్నడంబులోని కస్తూరి వాసన/ కలిసిపోయె తేట తెలుగునందు' అంటారు మిరియాల రామకృష్ణ. భారతదేశంలోని అతి ప్రాచీన భాషల్లో తెలుగు ఒకటి. ప్రపంచవ్యాప్తంగా 18 కోట్ల మంది మాట్లాడే భాష తెలుగు. లిపి వున్న 6 వేలకు పైగా భాషల్లో..అందమైన లిపివున్న రెండో భాష తెలుగు. 15వ శతాబ్దిలో వినుకొండ వల్లభ రాయుడు-'జగతి దల్లికంటె సౌభాగ్య సంపద/ మెచ్చుటాడు బిడ్డ మేలుగాదె' అని తెలుగు ప్రాశస్త్యాన్ని కొనియాడినా..'తెలుగదేలయన్న దేశంబు తెలుగేను/ తెలుగు వల్లభుండ తెలుగొకండ/ ఎల్ల నృపులు గొల్వ ఎరుగవే బాసాడి/ దేశ భాషలందు తెలుగు లెస్స' అని కన్నడ ప్రభువు శ్రీకృష్ణదేవరాయలు తెలుగు భాష కీర్తిని హిమాలయ శిఖరాగ్రాన నిలిపాడు. అయితే, గ్రాంథిక భాషలో వున్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చి, వ్యవహారిక భాషలో వున్న సౌందర్యాన్ని, సౌలభ్యాన్ని తెలుగు భాష ఆవాహన చేసుకునేలా భాషోద్యమానికి శ్రీకారం చుట్టిన మూలపురుషుడు గిడుగు రామ్మూర్తి. అందుకే- 'గ్రాంథికమ్ము నెత్తిన పిడుగు గిడుగు/ వ్యవహార భాషోద్యమ స్థాపక ఘనుడు గిడుగు/ తేట తేనియల తెల్లని పాల మీగడ గిడుగు/ కూరి తెలుగు భాషకు గొడుగు గిడుగు' అన్నారు. పులిదిండి మహేశ్వర్.

మనిషి నుంచి పుట్టిన భాష... కేవలం మాటల వారధి మాత్రమే కాదు, మన మూలాలను తెలియజెప్పి, ముందుకు నడిపే సారథి. ఆట, పాట, మాట, సంగీతం, కళలు, పండుగలు, సంస్కృతీ సంప్రదాయాలు ఏవైనా భాష లేకుండా పెంపొందలేవు. మాతృభాష ఏదైనా...అది తల్లితో సమానం. తల్లిపాలకు ప్రత్యామ్నాయం లేనట్లుగానే...అమ్మ భాషకూ ప్రత్యామ్నాయం లేదు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఉపాధి కోసం నేర్చుకోవాల్సి వచ్చిన ఆంగ్లభాష...స్థానికతను, ఉనికిని, మాతృభాషను మింగేసే స్థాయికి చేరింది. ఫ్రాన్స్, స్పెయిన్, చైనా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఇంజనీరింగ్, వైద్యశాస్త్రం వంటి కోర్సులన్నీ వారి స్థానిక భాషల్లోనే చెబుతున్నారు. విజ్ఞాన శాస్త్రాలను మాతృభాషలోనే చదువుకుంటున్నారు. ప్రపంచంలోని దాదాపు 110 దేశాల కంటే మన తెలుగునేల పెద్దది. చాలా యూరోపియన్ భాషలు కూడా తెలుగుకంటే చిన్నవే. కానీ, వాటికున్న గౌరవ మర్యాదలు తెలుగు భాషకు ఇవ్వడంలేదు. వేరే దేశాల్లో, ప్రాంతాల్లో...తెలుగు వచ్చిన వారితో తెలుగులో మాట్లాడాలన్నా కూడా ఆత్మన్యూనతా భావానికి గురయ్యే పరిస్థితి తెలుగోళ్లది. 'తెలుగువాడివై తెలుగు రాదనుచు/ సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా/ అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు/ సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా' అంటారు కాళోజీ. పరభాషా వ్యామోహంలో కొట్టుకుపోతూ...మాతృభాషను విస్మరించేవారికి ఇంతకంటే గొప్ప హెచ్చరిక ఏముంటుంది?

తెలుగులో చదవడం, మాట్లాడటం ఓ అభిరుచి కావాలి. కొత్త పదాల సృష్టి జరగాలి. తెలుగు భాషలో సహజంగా ఇమిడిపోయే పదాలను ఆహ్వానించాలి. తెలుగు భాషను నేర్చుకోవడం, తెలుగు సంస్కృతిని పెంపొందించుకోవడం తద్వారా తెలుగు భాషను బతికించుకోవడం ప్రతి తెలుగువాడి బాధ్యత. 'పరభాషా జ్ఞానాన్ని సంపాదించు/ కాని నీ భాషలోనే నువ్వు సంభాషించు/ తల్లి తండ్రి నేర్పినట్టి మాతృభాషరా/ తెలుగు మాట్లాడి వాళ్ల ఋణం/ తీర్చరా...' అంటాడు సినీకవి చంద్రబోస్. ప్రజలు కార్పొరేట్ స్కూళ్ల మాయలో పడి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ఆశల సౌధాల్లో చిక్కి...అటు మాతృభాష, ఇటు పరభాష-ఏదీ సరిగా నేర్చుకోలేని దుస్థితి నుంచి కాపాడాల్సిన బాధ్యత తెలుగు ప్రభుత్వాలదే. ప్రాథమిక స్థాయి నుంచే విద్యను మాతృభాషలో నేర్పించాలి. విజ్ఞాన శాస్త్రాలను తెలుగు భాషలోకి తర్జుమా చేయగలిగితే, తెలుగులోనే చదువుకునే అవకాశం లభిస్తుంది. పిల్లలకు మాతృభాషలో అందించే విజ్ఞానం తరతరాలకూ చేరుతుంది. గిడుగు వారి వారసత్వాన్ని భవిష్యత్తరాలకు అందించాల్సిన బాధ్యత మనది. ఆగస్టు 29 'తెలుగు భాషా దినోత్సవం' సందర్భంగా వివిధ సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇవి తెలుగు భాష వికాసానికి దోహదపడతాయని ఆశిద్దాం.

మహనీయుల మాట




ప్రతి మనిషికి
మరణం వుంటుంది కానీ...
మానవత్వానికి కాదు.
- మదర్ థెరిసా




కాశ్మీర్ ఎన్నికలతో మోడీకి మరో పాఠం?

ప్రస్తుతం



తెలకపల్లి రవి

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎన్నికల సంఘం (ఇ.సి) అనివార్యంగా నిర్వహిస్తున్న జమ్మూ కాశ్మీర్ ఎన్నికలపై ప్రపంచమంతా దృష్టి పెట్టింది. 2019లో మోడీ రెండవ సారి గెలిచిన తర్వాత 370వ అధికరణం రద్దు తర్వాత కేంద్రం చెప్పుకున్న గొప్పల నిజానిజాలేమిటో తెలుసుకునే సందర్భంగా అందరూ ఈ ఎన్నికలను చూస్తున్నారు. 2014లో చివరి సారి జరిగిన ఎన్నికలలో ఏర్పడిన శాసనసభ 2018లో రద్దయిన తర్వాత ఇంతవరకూ కాశ్మీర్‌లో ఎన్నికైన ప్రభుత్వమే లేకుండా పోయింది. సుప్రీం కోర్టు కచ్చితమైన ఆదేశాలిచ్చి వుండకపోతే ఇప్పుడైనా ఎన్నికలు జరిగేవా అనేది సందేహమే. ఇప్పటికైనా కోర్టు చెప్పినట్టు ఇసి సెప్టెంబరు 30 గడువు కొంచెం పొడగించి సెప్టెంబరు 18, 25, అక్టోబరు 2 తేదీలలో మూడు దశలుగా జరుపుతున్నది. దాంతోపాటే హర్యానా ఎన్నికలు కూడా జరుపుతూ మహారాష్ట్ర ఎన్నికలు మాత్రం తర్వాతకు వాయిదా వేసింది. ఇందుకు ఇ.సి చెబుతున్న కారణం చూస్తే కాశ్మీర్ పరిస్థితిపై ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా చేసిన హడావుడి అవాస్తవమని తేలిపోతుంది. కాశ్మీర్ ఎన్నికలలో శాంతిభద్రతల రీత్యా అధిక సంఖ్యలో సాయుధ దళాలు అవసరం గనక మహారాష్ట్రలో ఎన్నికలు జరపలేమన్నది దాని సమాధానం. ఏమైనా అసలంటూ ఎన్నికలు జరపడం ఆహ్వానించదగిన పరిణామం. 370 రద్దుతో కాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దు చేయడం, రాష్ట్ర హోదా తొలగించి కేంద్ర పాలిత ప్రాంతంగా చేయడం స్థానిక ప్రజలు ఏ మాత్రం ఆమోదించలేకపోయారు. దాన్ని వివిధ రూపాలలో వ్యక్తం చేస్తూ వస్తున్నారు కూడా. ఇప్పుడు పూర్తి స్థాయిలో ప్రకటించేందుకు, బిజెపిని దానితో చేతులు కలిపే పక్షాలనూ ఓడించేందుకు ఇది సరైన అవకాశమని భావిస్తున్నట్టు సంకేతాలు ఇస్తున్నారు. ఈ కారణం వల్లనే ఒకవైపున బిజెపి, మరోవైపున దానితో గతంలో చేతులు కలిపిన పిడిపి (పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ) రకరకాల మల్లగుల్లాలు పడుతుంటే అతి కీలకమైన పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని విజయం సాధించేందుకు వ్యూహాలు రచిస్తున్నది. ఆగస్టు 26 నామినేషన్ల ప్రారంభం కాగా ఈ లోగానే ఏదో ఒక అవగాహనకు రావాలన్నది ఆ రెండు పార్టీల లక్ష్యంగా వుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తదితరులు నేషనల్ కాన్ఫరెన్స్ అధినేతలైన ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లాలతో చర్చలు జరిపి దాదాపు ఒక అవగాహనకు వచ్చినట్టు ప్రకటించడం ఈ దిశలో పెద్ద ముందడుగేనని చెప్పొచ్చు.



> లోక్‌సభలో మెజార్టీ కోల్పోయిన బిజెపి కాశ్మీర్‌లోనూ ఆశలు సన్నగిల్లిన స్థితిలో వుంది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తోడు ఇప్పటివరకూ దూరం పెట్టిన రామ్ మాధవ్‌ను తీసుకొచ్చి బాధ్యత అప్పగించడంలోనూ ఈ సంగతి బోధపడుతుంది. గతంలో కాశ్మీర్ ఈశాన్య రాష్ట్రాలలో ఆయన చాలా బాగా పని చేశారనేది ఆర్.ఎస్.ఎస్ అంచనాగా చెబుతారు. ముఖ్యంగా పిడిపితో కూటమి కట్టడంలో ఆయన పాత్ర చాలా వుంది గనక ఆపద్ధర్మంగా పిలిపించారంటున్నారు. దీంతోపాటు స్వయంగా అమిత్ షాతో సహా రంగంలోకి దిగి విద్వేష ప్రచారం తీవ్రం చేస్తున్నారు.

బలాబలాల తీరు

కాంగ్రెస్ కాన్ఫరెన్స్‌లు చివరి సారిగా 2008లో కలసి పోటీ చేసి విజయం సాధించాయి. 2014లో విడివిడిగా తలపడ్డాయి. ఆ ఎన్నికల నాటికి మెహబూబా ముఫ్తీ తండ్రి ముఫ్తీ మహ్మద్ సయ్యద్ జీవించి వున్నారు. 28 స్థానాలతో పిడిపి పెద్ద పార్టీగా రాగా కాన్ఫరెన్స్ 15కు పరిమితమైంది. బిజెపికి 25, కాంగ్రెస్‌కు 12 వచ్చాయి. జమ్మూలో స్థానాలు తెచ్చుకున్న బిజెపిని వదలిపెట్టి మిగిలిన లౌకిక పార్టీలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ప్రజాస్వామిక వాదులు భావించినా అది సాధ్యం కాలేదు. ప్రాంతీయ పార్టీలుగా ఎన్‌సి, పిడిపి మధ్య వైరుధ్యాలే అందుకు కారణమైనాయి. జమ్మూలో స్థానాలు తెచ్చుకున్న బిజెపితో కలిపి సర్కారు ఏర్పాటు చేయడం తనకు ప్రయోజనమని పిడిపి భావించింది తప్ప పర్యవసానాలు పట్టించుకోలేదు. వాస్తవానికి ఆ రెండు పార్టీల రాజకీయ వ్యూహాలు పూర్తి విరుద్ధంగా వుంటాయి. ఎన్నికలలోనూ ఒకరినొకరు తీవ్రంగా తిట్టుకున్నారు. అయినా సరే ఎన్‌సిని రాకుండా చేయడం ధ్యేయంగా బిజెపి, పిడిపి చేతులు కలిపి అధికారంలోకి వచ్చాయి. ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన ముఫ్తీ మరణం, దీర్ఘకాల అనిశ్చితి తర్వాత మెహబూబా పదవి చేపట్టినా ఇరుపార్టీల మధ్య సఖ్యత కుదిరింది లేదు. ఈ లోగా తీవ్రవాదులు, విచ్ఛిన్న శక్తుల కుట్రలకు తోడు తమ ఆధిపత్యం పెంచుకోవాలన్న బిజెపి ఆరాటం పరిస్థితిని ఇంకా దిగజార్చింది. చివరకు 2018 నవంబరులో అప్పటి గవర్నర్ సత్యపాల్ మాలిక్ శాసనసభ రద్దుకు సిఫార్సు చేశారు. ఆ కాలంలో జరిగిన కుటిల రాజకీయాలేమిటో ఆయనే తర్వాత బయటపెట్టారు కూడా. వీటన్నిటి కారణంగా పరిస్థితి మరింత దిగజారింది. కాశ్మీర్‌లోనే తాము అధికారంలో భాగస్వాములు కావడం గొప్ప మార్పుగా భావించిన బిజెపి దాన్ని నిలబెట్టుకోవడమే ఏకైక లక్ష్యంగా దుస్సాహసాలకు పాల్పడింది. 2019లో 370 రద్దు దానికి పరాకాష్ట. ఒక విధంగా ఈ నిరంకుశ చర్య కలహిస్తున్న ఎన్‌సి, పిడిపిని ఇతర లౌకిక ప్రజాస్వామిక శక్తులను ఒకతాటి మీదకు తెచ్చింది. ముందు నుంచి ప్రజాస్వామ్య పోరాటంలోనూ తీవ్రవాదాన్ని ఎదుర్కోవడంలోనూ ముందున్న సిపిఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎంఎల్‌ఎ మహ్మద్ యూసఫ్ తరిగామి వంటివారు ఈ కృషిలో చొరవ చూపారు. 370 రద్దు తర్వాత ఏడాదికి గుప్కార్ అలయన్స్ పేరిట ఒక తాటి మీదకు వచ్చి ఉమ్మడిగా పోరాడతామని ప్రకటించారు.

> 370 రద్దుతో కాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దు చేయడం, రాష్ట్ర హోదా తొలగించి కేంద్ర పాలిత ప్రాంతంగా చేయడం స్థానిక ప్రజలు ఏ మాత్రం ఆమోదించలేకపోయారు. దాన్ని వివిధ రూపాలలో వ్యక్తం చేస్తూ వస్తున్నారు కూడా. ఇప్పుడు పూర్తి స్థాయిలో ప్రకటించేందుకు, బిజెపిని దానితో చేతులు కలిపే పక్షాలనూ ఓడించేందుకు ఇది సరైన అవకాశమని భావిస్తున్నట్టు సంకేతాలు ఇస్తున్నారు.

డిడిసి, లోక్‌సభ సంకేతాలు

అందుకు తగినట్టే 2020 డిసెంబర్‌లో కాశ్మీర్‌లో జిల్లా అభివృద్ధి మండళ్లకు (డిడిసి) జరిగిన ఎన్నికలలో గుప్కార్ అలయన్స్ ఆధిక్యత సాధించగా బిజెపి జమ్మూలో ప్రభావం చూపించింది. మొన్నటి లోక్‌సభ ఎన్నికలలోనైతే జమ్మూలోని ఉద్ధంపూర్, జమ్మూ స్థానాలు బిజెపి గెల్చుకోగా, శ్రీనగర్, అనంతనాగ్ రాజౌరి నేషనల్ కాన్ఫరెన్స్ తెచ్చుకుంది. కాశ్మీర్ లోయలోని బారాముల్లా స్థానం నుంచి పిడిపిపై నేషనల్ కాన్ఫరెన్స్ తరపున ఒమర్ అబ్దుల్లా విజయం సాధిస్తారని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయగా వేర్పాటువాద అవామీ ఇత్తేహాద్ పార్టీ అభ్యర్థి, మూడు సార్లు ఎంఎల్‌ఎ షేక్ అబ్దుల్ రషీద్ ఇంజనీర్ స్వతంత్రుడుగా విజయం సాధించారు. ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్న ఆయన ప్రత్యేకంగా కోర్టు ద్వారా వచ్చి ప్రమాణ స్వీకారం చేయడం మీడియాను ఆకర్షించింది. లోక్‌సభ ఎన్నికలలో వచ్చిన ఓట్ల ప్రకారం చూస్తే నేషనల్ కాన్ఫరెన్స్ 36 చోట్ల, బిజెపి 29 చోట్ల ఆధిక్యతలో వుండగా మెహబూబా ముఫ్తీ పిడిపి కేవలం అయిదు చోట్ల, కాంగ్రెస్ ఏడు చోట్ల ఆధిక్యత తెచ్చుకోగలిగాయి. కాంగ్రెస్, ఎన్‌సి 'ఇండియా' బ్లాక్ లో వున్నా లోక్‌సభ ఎన్నికల్లో విడివిడిగానే పోటీ చేశాయి. ఈ ఫలితాల ప్రభావంతో కూడా కేంద్రం సుప్రీం కోర్టు ఆదేశించినా ఎన్నికలు వాయిదా వేస్తూ వచ్చింది. పైగా హోం శాఖ లెఫ్టినెంట్ గవర్నర్ పాలనాధికారాలు నియామక అధికారాలు మరింత పెంచేసింది. జమ్మూలో సీట్లు పెంచుకోవడంతో పాటు రిజర్వేషన్ల పాచికనూ ఉపయోగించింది. టెర్రరిజం అణచివేత పేరిట సైనిక దళాల చర్యలు, రాజకీయంగా గవర్నర్ అధికారాల పెంపు, కార్పొరేట్లకు నజరానాల పెంపు, మతపరమైన విభజన తీవ్రం చేయడం ఉధృతంగా సాగించింది. మరోవైపున తీవ్రవాద కార్యకలాపాలు కాశ్మీర్ నుంచి జమ్మూకు వ్యాపించాయంటూ అక్కడ ప్రత్యేకంగా సైనిక బలగాలను పెంచింది. ఇంత జరుగుతున్నా ప్రధాన ప్రాంతీయ పార్టీలైన పిడిపి, ఎన్‌సి మాత్రం పరస్పర వైరుధ్యాలనే ప్రధానంగా చూస్తూ చేతులు కలపడానికి నిరాకరించడమే లోపం. మొదట్లో ప్రాంతీయ పార్టీలను కేంద్రానికి ఏజంటుగా చూసిన వారే ఈ పరిణామాల తర్వాత బలపర్చడం మొదలు పెట్టారు. ఆఖరుకు కొంత కాలం ఎన్నికలకు దూరంగా వుండిపోయిన పార్టీలు కూడా ఓట్లతోనే సమాధానమిస్తామని రంగంలోకి దిగాయి, రషీద్ ఇంజనీర్ విజయం అలాంటిదే. లోక్‌సభ ఎన్నికల్లో ఆయన అవామీ పార్టీకి 14 చోట్ల ఆధిక్యత వచ్చింది. కాశ్మీర్ లోయలో ఎన్‌సి, పిడిపిలకు కలిపితే 70 శాతం ఓట్లున్నాయి గాని అవి కలిసి పోటీ చేసే అవకాశం కనిపించదు. బిజెపి గెలిచిన జమ్మూ స్థానం ఉద్ధంపూర్‌లో కూడా దానికి పది శాతం ఓట్లు తగ్గగా కాంగ్రెస్ ఓట్లు పెరిగాయి. ఇదేగాక జమ్మూ కాశ్మీర్ పీపుల్స్ పార్టీ, ఆప్ పార్టీ కూడా ఓట్లు తెచ్చుకున్నాయి.


లౌకిక పార్టీల సమీకరణ-బిజెపి ఎత్తుగడలు

మొత్తంగా చూస్తే కాశ్మీర్‌లో లౌకిక పార్టీలన్నిటికీ కలిపితే గణనీయమైన ఆధిక్యత వుంది. వారంతా ఒక తాటిపైకి వచ్చి పోటీ చేయాలని బిజెపిని ఓడించాలని సిపిఎం ఎప్పుడూ చెబుతున్నది. కానీ పిడిపికి స్థానాలు కేటాయించే అవకాశం లేదని ఎన్‌సి ముందే ప్రకటించింది. ఇక ఆ పార్టీ కూడా చాలా విషయాల్లో కలసి రాకుండా విడిగానే వ్యవహరిస్తూ వస్తోంది. ఈ పూర్వరంగంలో కాంగ్రెస్ ఎన్‌సి నాయకులు సమావేశం తర్వాత ఒక ఏకాభిప్రాయానికి వచ్చినట్టు ప్రకటించడం హర్షణీయమైన పరిణామమే. పునర్విభజన తర్వాత మొత్తం 90 స్థానాలలో 47 కాశ్మీర్‌లో 43 జమ్మూలో వున్నాయి. ఇప్పుడు యాభై చోట్ల ఎన్‌సి పోటీ చేస్తే 35-38 చోట్ల కాంగ్రెస్ పోటీ వుంటుందని భావిస్తున్నారు. మిత్రపక్షాలకు కూడా చోటు కల్పించనున్నట్టు ఎన్‌సి నాయకులు సూచనగా చెప్పారు. పిడిపిని కూడా వస్తే కలుపుకుంటారా అని అడగ్గా ఎవరికీ తలుపులు మూయలేదని వ్యాఖ్యానించారు. మరోవైపున లోక్‌సభలో మెజార్టీ కోల్పోయిన బిజెపి కాశ్మీర్‌లోనూ ఆశలు సన్నగిల్లిన స్థితిలో వుంది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తోడు ఇప్పటివరకూ దూరం పెట్టిన రామ్ మాధవ్‌ను తీసుకొచ్చి బాధ్యత అప్పగించడంలోనూ ఈ సంగతి బోధపడుతుంది. గతంలో కాశ్మీర్ ఈశాన్య రాష్ట్రాలలో ఆయన చాలా బాగా పని చేశారనేది ఆరెస్సెస్ అంచనాగా చెబుతారు. ముఖ్యంగా పిడిపితో కూటమి కట్టడంలో ఆయన పాత్ర చాలా వుంది గనక ఆపద్ధర్మంగా పిలిపించారంటున్నారు. దీంతోపాటు స్వయంగా అమిత్ షాతో సహా రంగంలోకి దిగి విద్వేష ప్రచారం తీవ్రం చేస్తున్నారు. రాహుల్ గాంధీ కాశ్మీర్‌కు ప్రత్యేక పతాకం వుండాలనే ఎన్‌సి కోర్కెకు ఒప్పుకుంటారా, పాకిస్తాన్‌తో చర్చలకు ఒప్పుకుంటారా అంటూ మత పరమైన పది ప్రశ్నలు వదలడం ఇందుకో నిదర్శనం, ఇదే విషయమై తరగామిని అడిగినపుడు కాశ్మీర్ పార్టీలు మొదటి నుంచి ఆ వైఖరితోనే వున్నాయని గుర్తు చేశారు. బిజెపి, పిడిపి కూటమి కట్టినప్పుడు కూడా ఇదే వైఖరితో వున్నాయి గనక ఇప్పుడేదో కొత్తగా వివాదం చేయడంలో అర్థమేముంది? కాశ్మీరియత్, ఇన్సానియత్, జంబోరియత్ అనే మూడు అంశాలను కాపాడటం కీలకంగా ఎన్నికలలో పాల్గొని విజయం సాధించాలని లౌకిక వాదులు కోరుతున్నారు. మీడియా పైనా గతంలో విధించిన ఆంక్షలు సడలించాలని కూడా తరిగామి కోరారు. మానవ హక్కులపై దాడి, సైనిక వలయంలా మారిన పరిస్థితి సడలించకుండా ఎన్నికల పోరాటం సాధ్యం కాదు. మరి మోడీ సర్కారు ఆ విజ్ఞత చూపకపోతే కేంద్రంపై నిరసన ఇంకా పెరుగుతుంది. అది ఎన్నికల ఫలితాల్లోనూ ప్రతిబింబించవచ్చు.

◆

జి.యం ఆవాలతో వంటనూనెల కొరత తీరుతుందా?

విమర్శ



ఎన్.వేణుగోపాలరావు

ప్రపంచ వాణిజ్య సంస్థ ముసుగులో మేథోపర హక్కుల చట్టంలోకి చొప్పించిన వ్యవసాయ సాంకేతికాలు, వివిధ బహుళ జాతి కంపెనీలకు వ్యాపార వస్తువులుగా మారాయి. రానురాను 75 శాతం వ్యవసాయ కృత్రిమ ఉపకరణాల ఉత్పత్తి, అమ్మకం కేవలం మూడు (బేయర్+మాన్సెంటో, డౌ+డూ ఫాంట్, సింజెంటా+కెమిచైనా) అతి పెద్ద పెట్టుబడిదారుల అదుపులోకి వెళ్ళాయి. ఈ కంపెనీల వార్షిక బడ్జెట్ కొన్ని దేశాల స్థూల జాతీయ ఉత్పత్తుల కంటే ఎక్కువ. ఇవి ప్రపంచ వ్యవసాయాన్ని అనగా అతి కీలకమైన ఆహార రంగాన్ని నియంత్రించే స్థాయికి ఎదిగాయి. ఈ నేపథ్యంలో ప్రవేశ పెట్టినవే నూతన సాంకేతికాభివృద్ధి పేరుతో వచ్చిన పంటల విత్తనాలు, జన్యు మార్పిడి జీవులు. ఇవి అనేక వ్యవసాయ సమస్యల్ని పరిష్కరించగలవని వేల మంది శాస్త్రవేత్తలను, భాషా నిపుణులను వినియోగించి వివిధ దేశాలకు ప్రచారం చేశారు. ఫలితంగా అమెరికా మొదలుకొని ఆస్ట్రేలియా వరకు మాన్సెంటో వంటి కంపెనీ రూపొందించిన జి.యం విత్తనాల మాయలో పడ్డాయి. భారతదేశంలో కూడా 2000 సంవత్సరం నాటికి పార్లమెంట్‌లో చర్చ లేకుండా, రాష్ట్రాలతో సంప్రదింపులు జరపకుండా బి.టి పత్తి హైబ్రీడ్ విత్తనాల రూపంలో మొదటిగా ఇవి వ్యాపించాయి. గణాంకాల్ని తారుమారు చేసి పర్యవసానాన్ని గుర్తించకుండా చేసి, బి.టి హైబ్రీడ్‌లే అన్ని సమస్యల్ని పరిష్కరించ గలవని నమ్మించాయి కంపెనీలు. ఈ అనుభవాల్ని అప్పటి క్యాబినెట్ సెక్రటరీ టి.ఆర్. సుబ్రమణ్యన్ ది హిందు పత్రిక (25.05.17)లో గుర్తు చేసుకొన్నారు. జరిగిన హ్రస్వదృష్టి సంస్కరణలు తెచ్చిన ప్రమాదాన్ని వివరించారు. అయితే బి.టి వంగ, బి.టి ఆవాల వంటి పంటలకొచ్చేటప్పటికి విషయం కొంత అర్థమయ్యింది. అయినా నూతన సాంకేతికాలు లేక బయో టెక్నాలజీ అంటే జి.యం టెక్నాలజీ అని నమ్మిన దేశీయ శాస్త్రవేత్తలు, ఇంకా వాటిని (బి.టి విత్తనాలు) సమర్థిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు దేశం బి.టి ఆవాల రూపకల్పనలో పడింది. వాటికి దేశీయ తొడుగు ఏర్పడింది. గత 2-3 సంవత్సరాలుగా ప్రభుత్వ న్యాయవాదులు (సొలిసిటర్ జనరల్స్), జి.యం సాంకేతికాల విశేషణా వ్యవస్థ (జి.ఇ.ఎ.సి) సహకారంతో ఈ జి.యం ఆవాలు రూపొందించిన వారి తరపున దేశ ఉన్నత న్యాయస్థానంలో పోరాడుతూనే ఉన్నారు. వారి ప్రతిపాదనలో ఉన్న లోపాన్ని అరుణ రూడ్రిగ్రస్ (జీన్ కాంపైన్), కవిత కురుగంటి (జి.యం లేని భారత వ్యవసాయ సంఘం)లు కోర్టు ముందుంచారు. వీరి వాదనలకు స్పందించిన డా॥ధీరజ్ సింగ్ (ఆవాల పరిశోధకుడు) న్యాయస్థానానికి అదనపు సమాచారాన్ని కూడా సమర్పించారు. ఐ.సి.ఎ.ఆర్ గత 10-12 సంవత్సరాల్లో అనేక ఆవాల హైబ్రీడ్లను రూపొందించి రైతులకిచ్చింది. అలానే ఆవాల పంటకు తగిన యాజమాన్య పద్ధతుల్ని విస్తరింపజేసింది. ఫలితంగా దేశంలో ఆవాల ఉత్పత్తులు 38 శాతం పెంచగలిగిన అంశాన్ని వివరించారు. డా. సింగ్ దేశంలో ఉన్న అతి విలువైన ఆవ మూల వంగడాల (జర్మ్‌పాజం) రక్షణ అవసరాన్ని గుర్తించి, ఈ జి.యం ఆవాల ప్రయత్నాన్ని తిరస్కరించాలని హెచ్చరించారు. ప్రమాదకరమైన రసాయన కలుపు మందు వాడే పరిస్థితిని ఆవాల రైతులకు కల్పించవద్దని కోరారు (29.11.22, 02.12.22, 07.01.23, 19.01.24 ది హిందు).

ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్ని, ముఖ్యంగా రైతుల్ని వైరుధ్యాల వలయంలోకి నెడుతున్నాయి. ఒకవైపు ప్రకృతి (సహజ) వ్యవసాయమనే ప్రహసనానికి కేటాయింపులు, మరోవైపు జన్యు మార్పిడి సాంకేతికాలకు ప్రోత్సాహకాలు. తాజాగా దేశ ఉన్నత న్యాయస్థానం ముందుకి జన్యు మార్పిడి ఆవాల విషయం తీర్పుకు వచ్చింది. కంపెనీల ఆర్థిక దన్నుతో, తస్కరించిన జన్యువుల నేపథ్యంలో అసంపూర్ణమైన, అసంబద్ధమైన క్షేత్ర స్థాయి అధ్యయనాలతో ఢిల్లీ యూనివర్సిటీ శాస్త్రవేత్త డా॥ దీపిక్ పెంతల్ ఎన్నో చట్టాల్ని, పర్యావరణ రక్షణ శాసనాల్ని, సాటి శాస్త్రవేత్తల విమర్శల్ని లెక్క చేయకుండా రూపొందించిందే ఈ "జి.యం ఆవాల" వంగడం. ఇది వాస్తవానికి బేయర్ కంపెనీ రూపొందించిన దానికి నకలు. దానికిప్పుడు "స్వదేశీ" అనే ముసుగు తొడిగారు. తక్కువ పురుగు మందులు, ఎక్కువ కలుపు మందులు వాడి సాగు ఖర్చును తగ్గించేందుకు(?) ఇది వెసులుబాటు కల్పిస్తుందన్నారు. పైగా దీని వల్ల వంటనూనెల కొరత తీరిపోతుందట! ఇదెంత అవాస్తవమో జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్తలు బయటపెట్టారు. అలానే జి.యం హైబ్రిడ్లను నిషేధించి కేవలం సాధారణ కనోలా (ఆవాలు) రకాలను మాత్రమే పండించగలుగుతున్న బ్రిటన్, ఫ్రాన్స్, చెకోస్లేవేకియా, నెదర్లాండ్స్, స్పెయిన్, జర్మనీ వంటి దేశాల ఆవపంట ఉత్పాదత భారతదేశం కంటే ఎందుకు ఎక్కువో వీళ్ళు చెప్పరు. బీహార్‌లో గత 8-10 ఏళ్లల్లో "సిస్టమ్ ఆఫ్ మస్టర్డ్ ఇంటెన్సిఫికేషన్" అనే పథకం ద్వారా దేశీయ వంగడాలు మాత్రమే వాడి ఏ విధంగా అధిక దిగుబడులు తీశారో వీళ్ళు గుర్తించరు. అయినా డా॥దీపక్ రూపొందించిన "ధారా మస్టర్డ్ హైబ్రిడ్-2" విడుదలకు రంగాన్ని సిద్ధం చేశారు. ఈ దశలో పర్యావరణ, ప్రజారోగ్య ఉద్యమకారులు కొందరు న్యాయస్థానం ద్వారా ఈ వరవడికి అభ్యంతరం తెలియజేశారు. జి.యం ఆవాల పరిశోధనలో ఉన్న లోపాల్ని, వాటి ద్వారా సమర్పించిబడ్డ గణాంకాల డొల్లతనాన్ని, జి.ఇ.ఎ.సి వారి అసంపూర్ణ వివరణని బహిర్గత పరిచారు. ఫలితంగా గత సంవత్సరం కోర్టు వారి ఆదేశం ప్రకారం, జి.యం. ఆవాలపై మళ్లీ క్షేత్ర పరిశోధనలు జరపాల్సి వచ్చింది. జి.ఇ.ఎ.సి వారు వాటిని విశ్లేషించాల్సి వచ్చింది. కోర్టు వారి ముందు ప్రభుత్వ న్యాయవాదులు తుషార్ మెహతా, ఐశ్వర్య భాటీ వాదించాల్సి వచ్చింది. దేశ జనాభాకు సరిపడినంత వంట నూనెలు ఉత్పత్తి చేయలేక పోతున్నామని, ఫలితంగా విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని వినియోగించి వంటనూనెల్ని దిగుమతి చేసుకుంటున్నామని ప్రభుత్వ న్యాయవాదులు ఈ సందర్భంగా గణాంకాల ద్వారా వివరించారు. 2020-21లో దేశానికి 24.6 మిలియన్ టన్నుల వంటనూనెలు అవసరమైతే, కేవలం 11.1 మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి చేశామట. పర్యవసానంగా రూ.1,50,000 కోట్లు ఖర్చు చేసి 13.45 మి.ట వంట నూనెల్ని దిగుమతి చేసుకొన్నామట. 2022-23లో ఇది 15.5 మి.ట చేరిందట. మనం పర్యావరణ, ప్రజారోగ్య రక్షణ అని సమర్థించుకొంటే ప్రజల ఆహార హక్కు చట్టాన్ని అటకెక్కించవలసి వస్తుందట. పైగా మనకు వంటనూనెల్ని అమ్మే అమెరికా, మెక్సికో, కెనడా, బ్రెజిల్ వంటి దేశాల్లో జి.యం పంట విత్తనాలు వాడబడుతున్నాయట. ఈ సమస్యల పరిష్కారానికి ఈ జి.యం ఆవాలు (డి.యం.హెచ్11) దారి చూపబోతున్నదట.

వారి వాదనలకు ప్రతిగా, న్యాయవాది ప్రశాంత భూషణ్ కోర్టు వారికి మరో కోణంలో వివరించారు. ఈ సాంకేతికాల్ని రూపొందించిన వారు, పరీక్షించిన వారు కోర్టు వారు కోరినట్లు పరిపూర్ణ ఫలితాలతో రాలేదు. అసంపూర్ణ క్షేత్ర స్థాయి పరిశీలనలు, అసంబద్ధ విశ్లేషణతో తమ నివేదికల్ని కోర్టు ముందుంచారు. జి.యం ఆవాలులో చొప్పించిన కలుపు మందు తట్టుకొనే జన్యువు నిష్ప్రయోజనమైనది. వాస్తవానికి ఆ కలుపు మందు (గ్లైఫాసేట్) అమెరికాలో మాదిరి భారతదేశంలో వాడడం లేదు. నిజానికి దాన్ని భారతదేశంలో నిషేధించారు. దాని ద్వారా వచ్చే అనేక అనర్థాలు ప్రపంచ వ్యాపితంగా గుర్తించారు. పైగా అంతర్జాతీయ ఒప్పందాల ప్రకారం (కార్టాజినా అగ్రిమెంట్) ఒక పంట మూలాలు ఉన్న ప్రాంతాల్లో ఆ పంట రకాల్లోకి ఈ జి.యం సాంకేతికాల్ని ప్రవేశ పెట్టకూడదు. అంటే వంగ, ఆవాలు వంటి పంటలు ముఖ్య మూలాలున్న చోట పనికి రాని ఇటువంటి పరిశోధనలు చేయకూడదు. భారతదేశంలో 5,500 పైగా మూల రకాలు ఆవ పంటల్లో ఉన్నాయని గుర్తించాలి. అంతేగాక భారతదేశం దిగుమతి చేసుకొనే వంటనూనెల్లో ఆవాల నూనె (కనోలా) శాతం చాలా తక్కువ. గణాంకాల ప్రకారం మన వంట నూనెల ఖర్చు పామ్ ఆయిల్, సోయాబీన్, పొద్దుతిరుగుడు వంటి వాటి వల్ల ఎక్కువ. అలానే ఆవాలు సాగు చేసే ప్రాంతాల్లో స్థానిక సంస్థల దన్నుతో జరిగే పరిశోధనా ఫలితాల్ని విస్తరింపజేసి, రైతులను (ఉత్పత్తిదారులను) రక్షింపజేస్తే ఫలితం ఎక్కువని 1985-90లో నడిచిన "ఆయిల్ సీడ్ స్పెషల్ మిషన్ (రాజీవ్ గాంధీ-యం.వి.రావు)" గుర్తించింది. ఆ తరహా వరవడి దేశంలో కొరవడడం వల్ల వంట నూనెల కొరత ఉన్నదని తేలింది. ఈ అంశంపై తీర్పు ఇవ్వాల్సిన జస్టిస్ నాగరత్న, సంజయ్ కరోల్‌లు మరో ముఖ్యమైన విషయాన్ని గుర్తించారు. మన రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్రాల పరిధిలోదనీ అందువల్ల రాష్ట్రాల నిర్ణయం, అవసరం ప్రకారం ఈ జి.యం. ఆవాలపై తీర్పు ఉంటుందని తేల్చారు. అలానే క్షేత్ర పరీక్షలోని లోపాల్ని సరిచేసి, ముఖ్య నిర్ధారణా సంఘం (జెనెటిక్ ఇంజనీరింగ్ ఎప్రైజల్ కమిటీ) పరిపూర్ణ నివేదిక ఇవ్వాల్సి వుంటుందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాల్లోని ప్రజా సంఘాలు, పర్యావరణ, ప్రజారోగ్య ఉద్యమకారులు స్పందించాల్సి ఉంటుంది. స్వదేశీ ముసుగులో నడిచే విత్తన కంపెనీల దోపిడీని ఎదుర్కోవలసి ఉంటుంది.



> కంపెనీల ఆర్థిక దన్నుతో, తస్కరించిన జన్యువుల నేపథ్యంలో...అసంపూర్ణమైన, అసంబద్ధమైన క్షేత్ర స్థాయి అధ్యయనాలతో ఢిల్లీ యూనివర్సిటీ శాస్త్రవేత్త డా॥ దీపిక్ పెంతల్ ఎన్నో చట్టాల్ని, పర్యావరణ రక్షణ శాసనాల్ని, సాటి శాస్త్రవేత్తల విమర్శల్ని లెక్క చేయకుండా రూపొందించిందే ఈ "జి.యం ఆవాల" వంగడం. ఇది వాస్తవానికి బేయర్ కంపెనీ రూపొందించిన దానికి నకలు. దానికిప్పుడు "స్వదేశీ" అనే ముసుగు తొడిగారు. తక్కువ పురుగు మందులు, ఎక్కువ కలుపు మందులు వాడి సాగు ఖర్చును తగ్గించేందుకు(?) ఇది వెసులుబాటు కల్పిస్తుందన్నారు. పైగా దీని వల్ల వంటనూనెల కొరత తీరిపోతుందట! ఇదెంత అవాస్తవమో జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్తలు బయటపెట్టారు.

/ వ్యాసకర్త రైతు రక్షణ వేదిక నేత,
సెల్ : 94900 98905 /

పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు..

- ఐఎండి హెచ్చరిక

న్యూఢిల్లీ : దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయని భారత వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీచేసింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర రాష్ట్రాల్లో ఆదివారం భారీ వర్షాలు పడే అవకాశముందనని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. గుజరాత్‌లో ఆదివారం నుంచి మంగళవారం వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. పశ్చిమబెంగాల్, జార్ఖండ్, అసోం, గోవా, మేఘాలయ, మహారాష్ట్రల్లో ఆదివారం భారీ నుంచి అతి భారీ వర్షం కురుస్తుందని భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడటంతో ఆదివారం ఆంధ్రప్రదేశ్ అంతటా భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

గాజాలో 48గంటల్లో 69మంది మృతి

గాజా : గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న క్రూరమైన దాడుల్లో గడచిన 48 గంటల్లో 69మంది మరణించారని, 212 మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. గత పది మాసాల్లో 40,334మంది మరణించగా, 93,356మంది గాయపడ్డారు. గాజాపై దాడుల్లో పాలస్తీనా పిల్లలే ఎక్కువగా చనిపోతున్నారని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం గాజాలో కీలకమైన మానవతాసాయం అందడం లేదు. దీంతో పిల్లల్లో పోషకాహార లోపం తీవ్రంగా పెచ్చరిల్లుతోందని ఐరాస అధికారి ఒకరు పేర్కొన్నారు. మరోపక్క ఉత్తర గాజాలోని ప్రాంతాలను ఖాళీ చేయాల్సిందిగా ఇజ్రాయిల్ మిలటరీ కొత్త ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి ఉత్తర, సెంట్రల్, దక్షిణ గాజా ప్రాంతాల్లో ముమ్మరంగా దాడులు కొనసాగుతున్నాయి. జులై 22 నుండి ఇప్పటివరకు గత నెల రోజుల కాలంలో ఇజ్రాయిల్ మిలటరీ ఏకంగా 13సార్లు ప్రజలను ఆయా ప్రాంతాల నుండి ఖాళీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేస్తూ వచ్చింది. ప్రస్తుతం ఈజిప్ట్ రాజధాని కైరోలో కాల్పుల విరమణ చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో హమాస్ ప్రతినిధి బృందం కైరో చేరుకుంది. ఆ బృందం ప్రత్యక్షంగా చర్చల్లో పాల్గొనకపోయినా చర్చలు ఎలా సాగుతున్నాయనే వివరాలను తెలుసుకుంటుందని వార్తలు పేర్కొన్నాయి.

చెరువులో మునిగి గ్యాంగ్‌రేప్ నిందితుడి మృతి

- తప్పించుకునే ప్రయత్నంలో మరణించాదన్న పోలీసులు

గౌహతి: అస్సాం నగావ్ జిల్లాలో ట్యూషన్ నుంచి ఇంటికెళ్తున్న పదో తరగతి విద్యార్థినిపై అత్యాచారం కేసులో నిందితుడు చెరువులో మునిగి శనివారం మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం ఈ కేసులో ముగ్గురు నిందితుల్లో తఫుజల్ ఇస్లాం పోలీసులకు చిక్కాడు. మిగిలిన ఇద్దరూ పరారీలో ఉన్నారు. క్రైం సీన్ రీక్రియేట్ చేసేందుకు పోలీసులు నిందితుడిని శనివారం తెల్లవారుజామున 4 గంటలకు సంఘటనా స్థలానికి తీసుకెళ్లారు. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో నిందితుడు చెరువులో దూకాడు. ఎస్‌డిఆర్‌ఎఫ్ దళాలు రెండు గంటల పాటు గాలించిన తర్వాత నిందితుడి మతదేహం దొరికింది. చేతులకు ఉన్న బేడీలను.. కానిస్టేబుల్ నుంచి లాగేసి.. పరుగెత్తి, నిందితుడు చెరువులో దూకినట్లు ఓ పోలీసు అధికారి చెప్పారు. తమ కానిస్టేబుల్‌కు కూడా గాయాలయ్యాయని తెలిపారు. కోచింగ్ క్లాస్ నుంచి సైకిల్‌పై తిరిగి వస్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు అడ్డగించి, 14 ఏళ్ల బాలికపై చెరువు వద్ద అత్యాచారానికి పాల్పడ్డారని పోలీసులు చెప్పారు.

విద్యార్థినుల భద్రతకు మార్గదర్శకాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విద్యార్థినుల భద్రతపై నిర్లక్ష్యం వహించొద్దని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర విద్యా శాఖ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. విద్యా సంస్థల్లో విద్యార్థినుల రక్షణను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ (పోక్సో) చట్టంతో సమానంగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల నిర్వహణకు జవాబుదారీతనంగా ఉండాలని తెలిపింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తీసుకున్న చర్యలను తెలపాలని కోరింది. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యం ఉండొద్దని, 'జీరో టోలరెన్స్ పాలసీ' ఉండాలని పేర్కొంది. పాఠశాలకు పిల్లలు హాజరు కావడానికి, వారు తిరిగి ఇళ్లకు వెళ్లడానికి చర్యలు తీసుకోవాలని సూచించింది.

కళ్ల ముందే ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

తెలియపరచలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధితుల విషయంలో కేవలం నష్టపరిహారం ప్రకటించి తప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని తీవ్రంగా గర్హిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో జరిగిన ప్రమాదాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ కమిటీ వేసి శాశ్వత ప్రమాద నివారణ చర్యలు తీసుకుంటే ఇటువంటివి పునరావృతం అయ్యేవి కాదన్నారు. చంద్రబాబుకు ఆ ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. ఇంతవరకు ఫార్మాలో 52 కంపెనీల్లో 23 ప్రమాద సంఘటనలు జరిగి 49 మంది చనిపోయారని తెలిపారు. ఆ ప్రమాదాలకు కారణమైన ఏ ఒక్కరినీ శిక్షించిన దాఖలాలు లేవన్నారు. ప్రమాద కారణాల నివేదికలను ఇంతవరకూ బయట పెట్టలేదని తెలిపారు. తక్షణమే అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ ఆధీనంలో ఫార్మా కంపెనీలు ఉండాలని, జరిగిన ప్రమాదంపై తక్షణమే జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో ఈ నెల 28న విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు.

సెబీ చీఫ్‌ను తొలగించాలి

- హిండెన్‌బర్గ్ ప్రశ్నలకు సమాధానాలు కావాలి
- హిందూ గ్రూప్ డైరెక్టర్ ఎన్.రామ్


సెమినార్‌లో మాట్లాడుతున్న హిందూ గ్రూప్ డైరెక్టర్ ఎన్.రామ్

న్యూఢిల్లీ : అదానీ గ్రూపుతో సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్‌కు పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ రిసెర్చ్ తాజాగా నివేదిక ఇచ్చిన నేపథ్యంలో ఆమెను పదవి నుండి తొలగించాలని ది హిందూ గ్రూప్ పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎన్.రామ్ సూచించారు. మాధబి చర్యలు సమర్థనీయం కావని, హిండెన్‌బర్గ్ లేవనెత్తిన ప్రశ్నలకు ఆమె సమాధానం ఇవ్వలేదని ఆయన తెలిపారు. 'హిండెన్‌బర్గ్ నివేదిక, అదానీ గ్రూప్, సెబీ : స్వతంత్ర విచారణ ఆవశ్యకత' అనే అంశంపై ఇండియన్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ శుక్రవారం ఏర్పాటు చేసిన సెమినార్‌లో రామ్ ప్రసంగిస్తూ హిండెన్‌బర్గ్ ప్రచురించిన సమగ్ర నివేదిక పరిశోధనాత్మక జర్నలిజానికి ఒక గొప్ప ఉదాహరణ అని వ్యాఖ్యానించారు.

'ఏ ఆర్థిక కుంభకోణంలో అయినా... అది బోఫోర్స్ కావచ్చు. లేదా రఫేల్ కుంభకోణం కావచ్చు. కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించడం సహజం. ఆ కప్పిపుచ్చుకోవడం సమర్థవంతంగా జరిగిందా లేక పచ్చిగా జరిగిందా అన్నదే ప్రశ్న. మన సంస్థలు ఘోరంగా విఫలమయ్యాయి' అని రామ్ తెలిపారు. సెబీ సభ్యులు, దాని ఛైర్‌పర్సన్‌ను ఎవరు నియమించారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఉద్దేశాలను తాను ప్రశ్నించడం లేదని అంటూ ఈ కేసును న్యాయస్థానం లోతుగా పరిశీలించలేదని అభిప్రాయపడ్డారు. 'ఎన్నికల బాండ్ల కేసులో సుప్రీంకోర్టును మనం ప్రశంసించాలి. కానీ అంతే ప్రాధాన్యత కలిగిన ఈ కేసులో ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య బెంచ్ వైఫల్యం కన్పిస్తోంది. సెబీ హామీలను అత్యున్నత న్యాయస్థానం ఎందుకు అంగీకరించింది? సెబీ దర్యాప్తుల ఫలితాలను ఎందుకు విచారించలేదు?' అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో రెండు మూడు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని రామ్ అన్నారు. 'సెబీ ఛైర్‌పర్సన్ లేదా సభ్యులు పెట్టిన పెట్టుబడులు ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఉన్నాయా? దర్యాప్తులో ఏం తేలింది? అదానీపై జరిపిన విచారణలో సెబీ ఛైర్‌పర్సన్ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్నారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాల్సి ఉంది' అని చెప్పారు.

ప్రధాని నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు, అదానీ గ్రూపునకు మధ్య ఉన్న సంబంధాలను ఆర్థికవేత్త ప్రొఫెసర్ వెంకటేష్ ఆత్రేయ ప్రస్తావించారు. అదానీ గ్రూపు సహకారంతో 'వైబ్రంట్ గుజరాత్'ను నిర్వహించారని చెప్పారు. సమస్య అదానీయా లేక సెబీ ఛైర్‌పర్సనా అన్నది కాదని, భారత ప్రభుత్వ ఆర్థిక విధానాలతోనే సమస్య ఉన్నదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.రామకృష్ణన్, సీనియర్ న్యాయవాది ఆర్ వైగై ప్రసంగించారు.

అమెరికాతో భారత్ రక్షణ ఒప్పందం

- పెంటగాన్‌లో లాయిడ్, రాజ్‌నాథ్ సింగ్ భేటీ


పెంటగాన్‌లో భేటీ అయిన రాజ్‌నాథ్ సింగ్, లాయిడ్

వాషింగ్టన్ : అమెరికాతో భారత్ తాజాగా మరో రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి ఆస్టిన్ లాయిడ్‌తో కలసి పెంటగాన్‌లో ఒప్పందంపై సంతకాలు చేశారు. కీలకమైన జాతీయ భద్రతకు విషయంలో ఈ సెక్యూరిటీ ఆఫ్ సప్లై అరేంజ్‌మెంట్ (సొసా) ఒప్పందం ఒక ముఖ్యమైన మైలురాయి వంటిదని అమెరికన్ రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అమెరికా స్పాన్సర్డ్ సొసాలో భారత్ 18వ భాగస్వామిగా ఉంది. ఇప్పటికే బ్రిటన్, ఇజ్రాయిల్, వివిధ యూరోపియన్ యూనియన్ దేశాలు, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా తదితర దేశాలు ఈ సొసా లో చేరాయి. రక్షణ పరిశ్రమలో అమెరికా, భారత్ మధ్య సహకార విస్తరణకు 2023లో రూపొందించిన రోడ్ మ్యాప్‌లో భాగంగానే సొసా ఒప్పందంలో భారత్ చేరినట్లు అమెరికన్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనిని ధ్రువీకరిస్తూ భారత రక్షణ మంత్రిత్వశాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదలజేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నాలుగు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా అమెరికాకు చెందిన ప్రముఖ రక్షణ కంపెనీలతో చర్చలు జరిపారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని శ్రీఘ్రతరం చేసేందుకు భారత భాగస్వాములతో కలిసి పనిచేసేందుకు రావాల్సిందిగా వారిని ఆహ్వానించామని రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అమెరికా రక్షణ పరిశ్రమ అధిపతులతో యుఎస్‌ఐఎస్‌పిఎఫ్ (యుఎస్ ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్) బోర్డు సభ్యులతో జరిపిన విందు సమావేశంలో విజన్ 2047లో అమెరికన్ కంపెనీల నుండి వచ్చే పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్‌తో భేటీ తరువాత అమెరికా జాతీయ భద్రతా సలహాదారు సులివాన్‌తో చర్చించారు. ఇరు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని విస్తృతం చేయడంపై చర్చించారు.

లైంగిక వేధింపుల కేసులో హెచ్‌డి రేవణ్ణ, ప్రజ్వల్‌లకు వ్యతిరేకంగా సిట్ చార్జిషీట్

- ప్రజాప్రతినిధుల కోర్టులో సమర్పణ

బెంగళూరు : కర్ణాటకలో సంచలనం రేపిన లైంగిక వేధింపుల కేసులో జెడిఎస్ ఎమ్మెల్యే హెచ్‌డి రేవణ్ణ, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణలపై నేర దర్యాప్తు విభాగానికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ప్రజ్వల్‌కు వ్యతిరేకంగా నాలుగు కేసులను దర్యాప్తు చేస్తున్న సిట్.. 2000లకు పైగా పేజీల చార్జిషీట్‌లో దాదాపు 150 మంది సాక్షుల వాంగ్మూలాలు ఉన్నాయని వివరించింది. ఈ చార్జిషీట్‌ను సిట్.. ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో సమర్పించింది. చార్జిషీట్‌ను దాఖలు చేసే ముందు నిపుణుల అభిప్రాయాన్ని తీసుకున్నట్టు సిట్ వివరించింది. హెచ్‌డి రేవణ్ణ, ఆయన కుమారుడు ప్రజ్వల్‌లపై భారతీయ శిక్షా స్మృతిలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. పలువురు మహిళలను ప్రజ్వల్ లైంగికంగా వేధిస్తున్న వీడియోలు వైరల్ కావడంతో... ఈ కేసు కర్ణాటకను ఒక కుదుపు కుదిపింది. జెడిఎస్‌తో పొత్తు పెట్టుకున్న బిజెపికి పెద్ద తలనొప్పిగా మారింది. ఈ ఏడాదిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో హాస్సన్ పార్లమెంటు స్థానం నుంచి ఎన్‌డిఎ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రజ్వల్ ఓటమి పాలయ్యాడు.

ఆర్‌జి కర్ ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకలపై సిబిఐ విచారణ

- మూడు వారాల్లోగా దర్యాప్తు పురోగతిపై నివేదిక

కోల్‌కతా : జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య జరిగిన ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలు, లావాదేవీలపై నమోదైన కేసు విచారణను సిబిఐ శనివారం చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ నుండి ఈ కేసును సిబిఐకి బదిలీ చేయాలని కలకత్తా హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో సిబిఐ ఈ చర్య తీసుకుంది. సిట్ నుండి అవసరమైన పత్రాలన్నింటినీ సిబిఐ శనివారం తీసుకుందని, తిరిగి ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేయడానికి సిద్ధమవుతోందని సిబిఐ అధికారి చెప్పారు. ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ అక్తర్ అలీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇడి విచారణ చేపట్టాలని అలీ గతంలో కోరారు. మూడు వారాల్లోగా దర్యాప్తు పురోగతిపై నివేదికను సమర్పించాల్సిందిగా హైకోర్టు సిబిఐని ఆదేశించింది. ఆ నివేదికను సమీక్షించడానికి తిరిగి సెప్టెంబరు 17కి కేసు విచారణను వాయిదా వేశారు.

డాక్టర్ల అసంతృప్తి

ఈ కేసులో ప్రమేయమున్న వారిని కనుగొనేందుకు కచ్చితంగా కాలపరిమితిని నిర్ధారించాలని రెసిడెంట్ డాక్టర్ల ప్రతినిధి బృందం సిబిఐని కోరింది. వారికి సంతృప్తికరమైన సమాధానం ఇవ్వడంలో సిబిఐ విఫలమైంది. డాక్టర్ల ప్రతినిధి బృందం శుక్రవారం సిబిఐ అధికారులతో భేటీ అయింది. తమ సహచరురాలిపై అత్యాచారం, హత్య కేసులో త్వరితగతిన దోషులను పట్టుకోవాలని వారు కోరారు. సిబిఐ ప్రతిస్పందన తమకు అసంతృప్తిని మిగిల్చిందని ప్రతినిధి బృంద సభ్యుడు ఒకరు వ్యాఖ్యానించారు. కేసును పరిష్కరించేందుకు కాల పరిమితిని విధించడం కష్టమని సిబిఐ అధికారులు చెప్పారని డాక్టర్ కింజాల్ తెలిపారు.



ఆందోళన చేస్తున్న ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ కార్యకర్తలు, మహిళలు

మెడికోకు న్యాయం చేయండి

- జోరువానలోనూ ఆందోళన

ఆర్‌జి కర్ ఆసుపత్రిలో దారుణానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, ప్రాణాలు కోల్పోయిన మెడికో కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యాన కొల్‌కతాలోని కాలేజి స్ట్రీట్ నుంచి 'లాల్ బజార్ చలో' కార్యక్రమం నిర్వహించారు. భారీ వర్షం కురుస్తున్నా... ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థినులు, మహిళలు పాల్గొని, మెడికోకు న్యాయం చేయాలని నినదించారు. ఆసుపత్రిలో విధ్వంసంతో ఏమాత్రం సంబంధం లేని వామపక్ష నాయకులకు పోలీసులు సమన్లు జారీ చేయడాన్ని ఖండించారు.

ఎన్ కన్వెన్షన్ నేలమట్టం

(మొదటి పేజీ తరువాయి)

శనివారం భారీ బందోబస్తు నడుమ సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ నిర్మాణాలను కూల్చి వేశారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ రెవెన్యూ పరిధిలోని నాదం చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఎకరంన్నర భూమిని ఆక్రమించుకొన్నారన్న ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదుతో అనురాగ్ విద్యా సంస్థల చైర్మన్, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై అక్కినేని నాగార్జున స్పందించారు. చెరువు ఎఫ్‌టిఎల్‌లో నిర్మాణాలు చేపట్టలేదని తెలిపారు. దీనిపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా హైడ్రా అధికారులు అక్రమంగా వ్యవహరించారని అన్నారు. నాగార్జున వ్యాఖ్యలను హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ ఖండించారు. తమ్మిడికుంట బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాల్లో ఎన్ కన్వెన్షన్ ఒకటని తెలిపారు. కూల్చివేతలపై ఎన్ కన్వెన్షన్ యాజమాన్యం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై శనివారం హైకోర్టు విచారణ చేపట్టింది. అఫిడవిట్ దాఖలు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ కూల్చివేతలు ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్ కన్వెన్షన్ వివాదం గత పదేళ్ల నుంచి నడుస్తోంది. తమ్మిడికుంట చెరువు బఫర్ జోన్‌లో ఎటువంటి అనుమతులూ లేకుండా నిర్మాణాలు చేపట్టారని ఎన్ కన్వెన్షన్ సెంటర్ యాజమాన్యానికి గత ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. కానీ, ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిని నిర్ణయిస్తూ 2014లో హెచ్‌ఎండిఎ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. దాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఎన్ కన్వెన్షన్ ఆశ్రయించగా, అక్కడ చుక్కెదురైంది. తర్వాత 2017లో మియాపూర్ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉంది. అప్పట్లో ప్రభుత్వం ప్రకటించిన బిఆర్‌ఎస్ (బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీం) ద్వారా 3 ఎకరాల 30 గుంటల భూమిలో అక్రమ కట్టడాలను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ఎన్ కన్వెన్షన్ యాజమాన్యం దరఖాస్తు చేసుకోగా అధికారులు తిరస్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చెరువుల కబ్జాలపై దృష్టి పెట్టింది. వివిధ ఏజెన్సీల నివేదికలను అధ్యయనం చేసిన తర్వాత చెరువుల ఆక్రమణలను నిరోధించడానికి 'హైడ్రా'ను ఏర్పాటు చేసింది.

అదృశ్య గోదావరిపై ఆరేళ్ల క్రితమే నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

నవంబర్ నెలలో ఈ మేరకు రూపొందించిన నివేదిక ప్రభుత్వానికి అందింది. అప్పటికే భారీ మొత్తంలో ప్రాజెక్టు కోసం ఖర్చు పెట్టి ఉండటంతో ఈ నివేదికను పెద్దగా పట్టించుకోని ఉండరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆ మరుసటి సంవత్సరం 2019 మార్చి నెలలో రాష్ట్రానికి చెందిన నీటిపారుదల రంగ నిపుణులు, రిటైర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.సుబ్బరాయుడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి వినతిపత్రం రూపంలో సిడబ్ల్యుసి నివేదికలోని అంశాలను, వాటిపైన తన విశ్లేషణను తీసుకువెళ్లారు. ఆ తరువాత ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడంతో నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికీ ఈ మేరకు వినతిపత్రం అందచేశారు. అయితే, వైసిపి ప్రభుత్వం కూడా ప్రాజెక్టు మనుగడకు అత్యంత కీలకమైన ఈ విషయాన్ని పట్టించుకోలేదు. నదీగర్భంలో లీకేజి ఇదే మాదిరి కొనసాగితే, పోలవరం ప్రాజెక్టు పూర్తయినా, పూర్తిస్థాయిలో నీటి వినియోగం అసాధ్యమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వాల ఈ వైఖరి చర్చనీయాంశంగా మారింది.

సిడబ్ల్యుసి అధ్యయనం ఇలా...

కొయిదా, పోలవరంల మధ్య భారీగా నీటి లీకేజ్ ఉందన్న సమాచారంతో కేంద్ర జలవనరుల సంఘం ఈ విషయంపై దృష్టి సారించింది. సమైక్య రాష్ట్రంలోని ఖమ్మం సబ్ డివిజన్ కేంద్రంగా పెద్దఎత్తున సర్వేలు నిర్వహించింది. 1977 నుండి 2006వ సంవత్సరం వరకు ఈ రెండు ప్రాంతాలలోలో నీటి ప్రవాహ వివరాలను సేకరించింది. 2006వ సంవత్సరం నుండి కోయాదా వద్ద డిశ్చార్జ్ వివరాలు సేకరించడం నిలిపివేసినట్లు, అయితే,.గేజ్‌ల ద్వారి పరిశీలన కొనసాగుతున్నట్లు సిడబ్ల్యుసి పేర్కొంది. 1977 జూన్ నుండి 2006 మే వరకు కోయిదా పోలవరం మధ్య 10,592 స్టేజ్ డిశ్చార్జ్ రికార్డులు అందుబాటులో ఉన్నాయని, వాటి ఆధారంగా ఈ రెండు ప్రాంతాల్లోనూ రోజువారి నీటి ప్రవాహాన్ని అంచనా వేసినట్లు పేర్కొంది. పదిరోజుల సగటు నీటి ప్రవాహం, నెలవారీ, వార్షిక నీటి ప్రవాహ అంశాలను 29 సంవత్సరాల పాటు సేకరించింది. రుతుపవనాలు ఉన్న కాలంలోనూ, లేని కాలం ప్రాతిపదికగా కూడా వివరాలు సేకరించింది. వీటన్నింటి సారాంశ కోయిదా, పోలవరం మధ నదీగర్భంలో భారీగా గోదావరి జలాలు మాయమవుతున్నాయనే..! ఈ విషయానే సిడబ్ల్యుసి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చింది. 'ఇందిరాసాగర్ పోలవరం ప్రాజెక్టు రిజర్వాయర్ ప్రాంతంలో నీటి నష్టంపై ఒక అధ్యయనం'పేరిత సిడబ్ల్యుసికి చెందిన ఒక ఉన్నతాధికారి సవివరంగా ఒక నివేదికను కూడా ప్రచురించారు.



లాంగ్ మార్చ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

జెఎన్‌యు విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల దాడి

- ఖండించిన ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


విద్యార్థిని నెట్టివేస్తున్న పోలీసులు

జెఎన్‌యు విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు మరోసారి పాశవికంగా దాడి చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు లాంగ్ మార్చ్ నిర్వహించిన విద్యార్థులపై విరుచుకుపడ్డారు. ఈడ్చిపడేశారు. విద్యార్థులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ దాడిని ఎస్ఎఫ్ఐ ఖండించింది. ఎంసిఎంని పెంచడం, బరాక్ హాస్టల్‌ను పునఃప్రారంభించడం, జిఎస్‌గ్యాస్, జెఎన్‌యుఇఇలను పునరుద్ధరించడం తదితర డిమాండ్లతో వందలాది మంది విద్యార్థులు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు లాంగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఢిల్లీ కార్యదర్శి, జెఎన్‌యుఎస్‌యు మాజీ అధ్యక్షురాలు ఐషీ ఘోష్‌తోపాటు జెఎన్‌యుఎస్‌యు వైస్ ప్రెసిడెంట్ అవిజిత్ ఘోష్, జెఎన్‌యు ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సాగర్ తదితర ఎస్ఎఫ్ఐ నేతలను అరెస్టు చేశారు. అంతకుముందు ఐషీ ఘోష్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఉన్నత విద్యపై దాడి చేస్తోందని విమర్శించారు. స్కాలర్‌షిప్‌ల్లో కోత విధించడంతోపాటు కొన్నింటిని రద్దు చేస్తోందని చెప్పారు. రిజర్వేషన్లను ఉల్లంఘించడంతోపాటు భిన్నాభిప్రాయాలను అణచివేస్తూ... దేశవ్యాప్తంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలపై దాడి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విజేత మదురోనే!

- ఎన్నికల ఫలితాలను సమర్థిస్తూ సుప్రీం తీర్పు
- సమర్థించిన కరేబియా దేశాల పరిశీలకులు

కారకస్ : వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో మదురోనే విజేత అని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును స్వాగతిస్తున్నట్లు కరేబియా ప్రాంత దేశాల పరిశీలకులు ప్రకటించారు. నికొలస్ మదురో ఎన్నిక అక్రమమని యాగీ చేసిన ప్రతిపక్షానికి, పాశ్చాత్య మీడియాకు ఇది చెంపపెట్టు లాంటిది. కోర్టు నిర్వహించిన దర్యాప్తు ప్రక్రియను కరేబియన్ పరిశీలకులు ప్రశంసించారు. సంబంధిత సాక్ష్యాధారాలన్నింటినీ నిష్పక్షపాతంగా, తటస్థ వైఖరితో వారు సమీక్షించారు. ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు, రాజకీయా పార్టీలు అందజేసిన సాక్ష్యాలను సమగ్రంగా సమీక్షించిన అనంతరం కోర్టు నిర్ణయం వెలువడింది. అతి మితవాద అభ్యర్థి ఎడ్మండో గొంజాలెజ్ వైఖరిని పరిశీలకులు తీవ్రంగా ఖండించారు. కోర్టు నిర్వహించిన న్యాయ ప్రక్రియతో ఆయన ఏకీభవించలేదని వారు పేర్కొన్నారు. ఎన్నికల రోజు ప్రశాంతంగానే గడిచిందని, అనేక పోలింగ్ స్టేషన్లలో తాము పర్యటించామని కరేబియన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు వారు ఒక లేఖ వెలువరించారు.

గాజాలో పోలియో వ్యాక్సినేషన్

- రెండు దశల్లో 16లక్షల డోసుల పంపిణీ

గాజా : ఆగస్టు మాసాంతానికల్లా పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని పాలస్తీనా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. పదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో వ్యాక్సినేషన్ వేయాలని, రెండు దశల్లో దీన్ని నిర్వహించాలని నిర్ణయించారు. నాలుగు వారాల గడువుతో రెండు దశలను నిర్వహిస్తారు. గాజాలో పోలియో వ్యాప్తిని నిలువరించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆరోగ్య శాఖ ప్రకటించింది. 6,40,000మందికి పైగా పిల్లలకు 16లక్షల డోసులు ఇవ్వాలని నిర్ణయించారు. 400 వ్యాక్సినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సెంట్రల్ గాజాలో పది నెలల శిశువుకు పోలియో సోకినట్లు డబ్ల్యుహెచ్‌ఓ కూడా గత వారం ధృవీకరించింది. గత 25 ఏళ్లలో ఇదే తొలి కేసు.

రష్యా పట్ల భారత వైఖరి మారితే యుద్ధం ఆగిపోతుంది ! : జెలెన్‌స్కీ

కీవ్ : రష్యా పట్ల భారత్, భారతీయులు తమ వైఖరి మార్చుకుంటే యుద్ధం వెంటనే నిలిచిపోతుందని, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆ యుద్ధాన్ని ఆపేస్తారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. రష్యాతో మాట్లాడండి.. పుతిన్ శాంతి వ్యతిరేకి. మా పాలిట యముడు.ఆయన మీకు మంచివాడయ్యారా? అని జెలెన్‌స్కీ భారత ప్రధాని మోడీని నేరుగా అడిగేశారు. రష్యాతో భారత్ సంబంధాలను తెంచుకోకపోవడంపై జెలెన్‌స్కీ తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు ఆ దేశంలో పర్యటించిన ప్రపంచ నాయకుల్లో మోడీ 72వ వాడు. రష్యా ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావాన్ని చూపగల పెద్ద దేశం భారత్ అని ఆయన వ్యాఖ్యానించారు. రష్యా నుండి చమురు కోసం భారత్ రికార్డుస్థాయిలో కుదుర్చుకున్న ఒప్పందాల గురించి ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. రష్యా నుండి భారత్ జరుపుతున్న చమురు కొనుగోళ్లపై మోడీ, జెలెన్‌స్కీలు చర్చించినట్లు విదేశాంగ మంత్రి జై శంకర్ చెప్పారు. ఇంధన మార్కెట్ పరిస్థితులు, ధరలు స్థిరంగా, సహేతుకంగా వుంచాల్సిన అవసరం గురించి ఆయనకు భారత ప్రతినిధి బృందం వివరించినట్లు తెలిపారు. తమ దేశంలో పర్యటిస్తున్న భారత మీడియాతో దాదాపు గంట పాటు జెలెన్‌స్కీ మాట్లాడారు. మోడీతో తన సమావేశం బాగా జరిగిందని, చారిత్రకమైన భేటీ అని ఆయన వ్యాఖ్యానించారు. చర్చల్లో ప్రధానమైన అంశాలతో పాటూ రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్లపై కూడా చర్చించినట్లు చెప్పారు. "ఈనాడు రష్యా ఎగుమతులకు సంబంధించి అనేక అవకాశాలు నిలిచిపోయాయి. మీ దేశం మాత్రమే ఆ అవకాశాలను వాడుకుంటోంది. మీరు గనక చమురు దిగుమతిని నిలిపివేసినట్టైతే పుతిన్‌కు పెను సవాళ్లు ఎదురవుతాయి." అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. రష్యా ఆర్థిక వ్యవస్థ యుద్ధంతో సతమతమవుతున్నదని, వందల కోట్ల మొత్తాలు భారత్ లేదా చైనా నుండి అందుతున్నాయని, ఆ డబ్బుతో రష్యా ఆయుధాలను బలోపేతం చేసుకుంటోందని, మనం దాన్ని ఆపివేయాలని జెలెన్‌స్కీ నొక్కి చెప్పారు. మోడీని పుతిన్ ఎన్నడూ గౌరవించలేదని, అందువల్లే గత నెల్లో మాస్కోలో మోడీ పర్యటిస్తున్న సమయంలోనే పుతిన్ ఉక్రెయిన్‌లో బాంబు దాడి జరిపారని జెలెన్‌స్కీ గుర్తు చేశారు. ఐక్యరాజ్య సమితి చేస్తున్న తీర్మానాలపై భారత్ వైఖరి గురించి చర్చకు వచ్చిందా అని ప్రశ్నించగా, లేదని చెప్పారు. భారత్ మద్దతు అందనందుకు మేం సంతోషంగా లేం. అయితే, తీర్మానాలు చేయడానికి ముందే మేం మాట్లాడాల్సి వుంది. కానీ గతాన్ని తవ్వుకునేందుకు మాకు సమయం లేదు. మంచిది, సానుకూలమైన అంశాలపైనే చర్చించాలనుకుంటున్నానని చెప్పారు. 'మీ దేశం మా వైపు వుండాలని మేం మరీ మరీ కోరుకుంటున్నాం." అని ఆయన స్పష్టం చేశారు. రక్షణ వంటి అత్యంత ఉన్నత సాంకేతిక రంగాల్లో సహ ఉత్పత్తి, అభివృద్ధి, సహకారం వంటి వాటికి అవకాశాలు వున్నాయని జెలెన్‌స్కీ చెప్పారు.

జర్మనీలో దారుణం

- కత్తితో పొడిచి ముగ్గురి హత్య

బెర్లిన్ : జర్మనీలో దారుణం చోటు చేసుకుంది. సోలిన్‌జెన్ నగర 650వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని వరుసగా మూడు రోజులు జరగనున్న వేడుకలు, ఉత్సవాల్లో భాగంగా ఒక వీధిలో ఉత్సవాలు జరుగుతుంటే ఒక వ్యక్తి కిరాతకంగా దాడులకు పాల్పడ్డాడు. ఇద్దరు పిల్లలతో సహా ముగ్గురిని హత్య చేసి, ఎనిమిది మందిని గాయపరిచాడని జర్మనీ పోలీసులు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ దాడి గురించి పోలీసులు ప్రత్యక్ష సాక్షులను, బాధితులను ప్రశ్నిస్తున్నారు. దాడి జరిగిన ఏరియాను మూసివేశారు. గాయపడిన వారిలో ఐదుగురు పరిస్థితి విషమంగా వుందని పోలీసులు చెప్పారు. రాత్రి 9.40గంటల సమయంలో కత్తితో ఒక గుర్తు తెలియని వ్యక్తి విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డాడని చెప్పారు. ఈ సంఘటన వెనుక గల కుట్రదారుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. దాడి గురించి ఏ మాత్రం సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాల్సిందిగా కోరారు. దుండగుడు సంఘటనా స్థలానికి కొద్ది మీటర్ల దూరంలోనే వున్నాడని, అకస్మాత్తుగా కత్తితో దాడికి పాల్పడ్డాడని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. అర్థరహితమైన చర్య ఇదని సోలిన్‌జెన్ నగర మేయర్ వ్యాఖ్యానించారు.

బాల్యం జ్ఞాపకాలు



రెండు పావలాలు, రెండు పది పైసల్లు
ఏవో నాలుగు చిల్లర పైసలు
జేబులో వేసుకొని నడుస్తు ఉంటే
ఘల్లు ఘల్లుమనే చప్పుళ్ళకు
పట్టరానంత ఆనందంతో
మరింతగా గెంతుతూ
ఊరంతా తిరగడం ఇంకా గుర్తే ...

ఏ పండక్కో, దసరాకో సంతలోనే కొన్న
కొత్త నిక్కర్, జుబ్బా జాకెట్ వేసుకొని
ఉత్సాహంగా ఊరంతా జట్టుగాళ్లతో
జట్టులు కట్టుకొని తిరగడం
ఇంకా జ్ఞాపకాల చెర నుండి చెరిగిపోలే

అర్థ రూపాయికి అడ్డడేసి ఈతపళ్ళు
నిక్కరు రెండు జేబుల్లో కుక్కికొని
ఒక్కో పండు గాల్లోకి ఎగరేసి
నోటితో అందుకొని
మనసారా తింటూ ఉన్న తియ్యదనం
ఇంకా మనసు పొరల్లో నుండి పారిపోలే

చాన్నాళ్ళకు అమ్మమ్మ ఇంటికి వెళ్ళి
తిరిగొస్తున్నప్పుడు తాతయ్య ఇచ్చిన రూపాయి బిళ్ళ
గడియ గడియకు జేబు నుండి తీసి చూసుకుంటూ
దోస్తులందరి దగ్గర రూపాయి గల వాడినని
గొప్పగా చెప్పుకుంటూ ఉప్పొంగిపోయే కాలం
ఇప్పుడిప్పుడే మరచిపోయినట్టులే

చిల్ల పెంకులతో పైసల ఆటైనా
చెట్టు ఆకులతో డబ్బుల ఆటైనా
రాతి బిళ్ళలతో రత్నాలాటాడినా
నునుపు బిళ్ళలతో ముత్యాలాటాడినా
గెలిచినా.. ఓడినా.. ఆటే ఒక పర్వమని
సంతోషమే సర్వమని గడిపిన బాల్యం
ఇప్పుడు కొనితెచ్చుకున్నా దొరుకుతుందా?

మనుషులు ఎంతగా మారిపోయినా
కాలం ఎంతగా కరిగిపోయినా
ఎన్నటికీ విడవనిది
ఎప్పటికీ మరవనిది
మైమరిపించే మధురానందం
మదిలో నిలిచే బాల్యానందమే!

- వినోద్ కుత్తుం, పలాస,
శ్రీకాకుళం జిల్లా,
96343 14502.

సరిచేసి రాయండి

పిల్లలూ,
ఇక్కడ తికమకగా ఇచ్చిన అక్షరాలను సరైన క్రమంలో రాస్తే అర్థవంతమైన పదం వస్తుంది. ట్రై చేయండి మరి!

తప్పు పదం	సరైన పదం	తప్పు పదం	సరైన పదం
నందంఆ		తాణంవారవ	
రవచా		శంకాఅవ	
తుపొరైలం		దారపుమంవ్వు	
గారుకం		పడిజీప్పు	
చరతుస్రం		గాయకూరలు	
లంర్షాకావ		డికోప	

నేను గీసిన బొమ్మ




పి.సిరి,
శామ్ చాప్‌మ్యాన్ స్కూల్,
కెనడా, టొరంటో.


పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఉబ్బసంపై అజాగ్రత్త వద్దు

ఉబ్బసం (ఆస్తమా) అనేది శ్వాసమార్గాలు కుదించుకుపోవటం వల్ల ఊపిరితిత్తుల్లో సమస్యలకు కారణమయ్యే దీర్ఘకాలిక వ్యాధి. శరీరానికి, ఊపిరితిత్తులకు సరిపడని సూక్ష్మ పదార్థాలు గాలి లేదా ఆహారం ద్వారా శ్వాస నాళాల్లోకి ప్రవేశించినప్పుడు వాటికి ప్రతిచర్యగా శరీరం స్పందిస్తుంది. దీనివల్ల వివిధ రకాలైన రసాయనాలు శ్వాస వ్యవస్థలో విడుదలైన శ్వాసనాళాలు కుచించుకుపోయేలా చేస్తాయి. దీనివల్ల ఊపిరి తీసుకోవటం కష్టమవుతుంది. కలుషిత వాతావరణం, ఆహారపు జాగ్రత్తల అలవాట్లలో మార్పు రావటం, జీవన విధానం మారిపోవటం వంటి కారణాలతో చిన్న వయస్సు వారి నుంచి పెద్ద వారి వరకూ ఎప్పుడైనా, ఎవరికైనా సంక్రమిస్తుంది. ఇది వంశ పారంపర్యంగా కూడా వస్తుంది. ఉబ్బసం వ్యాధిని పూర్తిగా నయం చేయడం సాధ్యంకాదు. కానీ దాని లక్షణాలను నియంత్రించి ఉబ్బస రోగులను పూర్తి జీవనం జీవించేలా చేయొచ్చు.

పిల్లల నుంచి పెద్దల వరకూ...

ప్రపంచవ్యాప్తంగా నేడు పిల్లల నుంచి పెద్దల వరకూ ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యల్లో ఆస్తమా ఒకటి. అందరిలోనూ వచ్చే శ్వాస సంబంధ వ్యాధి ఇది. ఇది సంభవిస్తే మాత్రం ఊపిరితిత్తుల్లో వాపు వల్ల వాయు మార్గాలు కుంచించుకు పోతాయి. దీని వల్ల శ్వాసకు అడ్డంకులు ఏర్పడి రోగి సరిగ్గా గాలి తీసుకోలేక ఇబ్బంది పడతాడు. ఈ వ్యాధిగ్రస్తుల్లో ముఖ్యంగా ఆయాసం, దగ్గు బాగా ఇబ్బంది పెడతాయి. ప్రధానంగా వర్షాకాలం, శీతాకాలంలో అస్తమా రోగులకు సమస్యలు మరింతగా పెరుగుతాయి. ఈ రెండు రుతువుల్లో సూర్యరశ్మి తక్కువగా ఉండటంతో విటమిన్-డి తగ్గిపోతుంది. రోగ నిరోధక శక్తి మరింత పడిపోయి ఆస్తమా తీవ్రరూపం దాల్చుతుంది. పుట్టిన పిల్లల దగ్గర నుంచి 30-35 సంవత్సరాలైనా పెద్ద వారిలో కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. చిన్న పిల్లల్లో పుట్టినప్పటి నుంచి ఈ వ్యాధి ఉంటే దానిని 'చైల్డ్‌హుడ్ ఆన్సెట్' ఆస్తమా అంటారు. అదే కొంత మందిలో చిన్నప్పుడు ఆస్తమా లక్షణాలు లేకుండా పెద్దవారిగా ఉన్నప్పుడు అంటే 20 సంవత్సరాల పైబడి ఉన్న వారిలో వస్తే దానిని 'అడల్ట్ ఆన్సెట్' ఆస్తమా అంటారు.



ఎలా వస్తుందంటే...

వంశ పారంపర్యం, వాతావరణ కాలుష్యం, దీర్ఘకాలిక జలుబు, సైనస్ ఇన్‌ఫెక్షన్స్, దుమ్ము, ధూళి, బూజు, పెంపుడు జంతువుల వెంట్రుకలు, ఆహార పదార్థాల్లోని రసాయనాల వంటి వల్ల ఆస్తమా వస్తుంది. చర్మ వ్యాధులు ఉన్న చిన్నారులకు వచ్చే అవకాశాలు ఎక్కువ. తల్లిదండ్రులు ఆస్తమా బాధితులైతే పిల్లలకు కూడా వచ్చే అవకాశం ఉంది. జలుబు లాంటి వైరల్ ఇన్ఫెక్షన్లతో కూడా రావచ్చు. వాయు కాలుష్యం, సిగరెట్ పొగ, సెంటు వాసనలు, దుమ్ము, ధూళితో కూడా సంభవిస్తుంది. యాస్పిరిన్ వంటి నొప్పి తగ్గించే ఔషధాలు, బీపీ నియంత్రణకు వాడే కొన్ని మందులతో కూడా వచ్చే అవకాశం ఉంది. అజీర్తి, గ్యాస్ ట్రబుల్, మానసిక ఒత్తిళ్ల తదితర వాటితో వచ్చే ప్రమాదం ఉంది.

అత్యుత్తమ చికిత్సా విధానం

ఇన్‌హెలేషన్ థెరపీ : ఇన్‌హెలేషన్ థెరపీ అనేది ఆస్తమా వ్యాధికి ప్రపంచ వ్యాప్తంగా ఆమోదం పొందిన అత్యుత్తమ చికిత్సా విధానం. దీని వల్ల నేరుగా మందు వాయు మార్గం నుంచి ఊపిరితిత్తుల్లోకి వెళ్లి తక్షణం పనిచేస్తుంది. ఇందులో 'రిలీవర్స్' తాత్కాలిక ఉపశమనం కలిగించేవి. 'ప్రివెంటర్స్' దీర్ఘకాలం వ్యాధిని అదుపులో ఉంచేవి. ఇతర ఔషధాలతో పోల్చితే ఈ ఇన్ హేలర్ల ద్వారా ఇచ్చే ఔషధాలు చాలా తక్కువ డోసేజీని కలిగి ఉంటాయి. నిరభ్యంతరంగా ఈ విధానాన్ని ఎంచుకోవచ్చుని వైద్య నిపుణులు చెబుతుంటారు.


మందులు- ఇంజక్షన్ రూపంలో : మాత్రల ద్వారా గనుక మందులను తీసుకుంటే అవి మొదట రక్తంలోకి వెళ్లి చిట్టచివరకు ఊపిరితిత్తులను చేరుకుని పనిచేస్తాయి. అందుకు కొంత ఎక్కువ సమయం పడుతుంది. సిరప్‌లు, ఇంజక్షన్లు ద్వారా తీసుకునే మందు మొదట రక్తంలో కలిసి చివరగా లంగ్స్‌పై ప్రభావాన్ని చూపుతాయి. ఈ మందులు రక్తంలో కలవడం వల్ల శరీరంలోని ఇతర భాగాలకు చేరిపోయి దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది.

అపోహలు వద్దు

ప్రపంచవ్యాప్తంగా 18 శాతం మందికి ఉబ్బసం (ఆస్తమా) ఉన్నట్టు అంచనా. అయితే ఉబ్బసం వ్యాధి వస్తే తగ్గదనే భయం ఒకరిదైతే.. పిల్లలు పెద్దవాళ్లయితే అదే తగ్గుతుందిలే అన్న నిర్లక్ష్యం మరొకరిది. ఇలాంటి అపోహలు అనేకం ఉన్నాయి. ఇది ఇన్‌ఫెక్షన్ కాదు. రోగనిరోధక వ్యవస్థలోని గందరగోళ పరిస్థితి వల్ల వచ్చే అలర్జీ. అయితే దీనికి జన్యుపరమైన కారణాలున్నాయి. సాధారణంగా 95 శాతం సందర్భాల్లో 'ఫ్యామిలీ హిస్టరీ' ఉంటుంది. తల్లిదండ్రులు ఇద్దరిలో ఒకరికే ఆస్తమా ఉంటే, పిల్లలకు వచ్చే ఆస్కారం 25 శాతం. ఇద్దరికీ ఉంటే మాత్రం 50 శాతం మేర ప్రమాదం పొంచి ఉన్నట్టే. హోమియో, ఆయుర్వేదం లాంటి ప్రత్యామ్నాయ వైద్యాల ద్వారా ఆస్తమా నుంచి పరిపూర్ణ విముక్తి లభించదు. అల్లోపతి విధానంలో కూడా శాశ్వతంగా ఆస్తమాను పోగొట్టలేం. కాని నియంత్రించొచ్చు. ఆస్తమాకు ఇచ్చే ఇంగ్లీషు మందులు సాధారణ జీవనశైలిని ప్రసాదించగలుగుతాయి. దీని విషయంలో తగిన జాగ్రత్త తీసుకోకపోతే ఊపిరితిత్తుల్లో మార్పులు జరుగుతాయి. పదేపదే ఇన్‌ఫెక్షన్లు వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. అందువల్ల తొలిదశలోనే నిపుణుల్ని సంప్రదిస్తే మంచిది. చిన్నపిల్లలు పెద్దయిన కొద్దీ అలర్జీలు తగ్గుతాయి. ఆస్తమా కూడా తగ్గుతుందనుకుని చాలామంది అశ్రద్ధ చేస్తారు. కాని మందులు వాడకుంటే ఆస్తమా ఉన్న పిల్లల్లో పెరుగుదల ఆగిపోతుంది. పెద్దయినంత మాత్రాన పోతుందనుకుంటే పొరపాటే. వాళ్ల ఊపిరితిత్తి పరిమాణం పెరుగుతుంది కాబట్టి, రియాక్షన్ తక్కువ కనబడుతుందంతే. నిజానికి వ్యాయామం వల్ల ఆస్తమా అటాక్స్ తగ్గుతాయి. దానివల్ల రక్తప్రసరణ పెరుగుతుంది. కేలరీలు వినియోగమై బరువు తగ్గుతారు. బరువు తగ్గేకొద్దీ ఆస్తమా రిస్కు తగ్గుతుంది. రక్తప్రసరణ పెరగడం వల్ల మంచి ఆక్సిజన్ అంది అవయవాలన్నీ శక్తిమంతమవుతాయి. అలర్జీలనే కాదు, ఇన్‌ఫెక్షన్లను కూడా తట్టుకోగలుగుతారు.



- డాక్టర్ అవినాష్ బత్తిన
ఎండి, జనరల్ మెడిసిన్,
సామాజిక ఆరోగ్య కేంద్రం
(కమ్యూనిటీ హెల్త్ సెంటర్
(సిహెచ్‌సి), చల్లపల్లి,
కృష్ణా జిల్లా.
సెల్ : 96183 83769



లక్షణాలు ఇవే ...

- అతికష్టం మీద ఊపిరితీసుకోవాల్సి రావటం.
- సాధారమైన కాకుండా తీవ్రమైన దగ్గు రావటం
- దగ్గు, ఆయాసం, శ్వాసలో గురక, ఛాతీ బిగుతుగా ఉన్న భావన
- ఛాతీ బిగుసుకుపోయినట్లు ఉండడం
- శ్వాసలో ఇబ్బంది రావడం
- ఆయాసం రావడం
- ఉదయం, రాత్రి వేళల్లో దగ్గు తీవ్రత పెరగడం
- విపరీతంగా గురక పెట్టడం
- ఊబకాయంతో ఇబ్బంది పడడం
- గొంతులో ఈల వేసినట్టుగా శబ్దం రావడం

ఈ జాగ్రత్తలు తీసుకోవటం మేలు

- అలర్జీ కారకాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి
- ధూమపానం చేయరాదు
- దుప్పట్లు, పిల్లో కవర్లను వేడి నీటిలో శుభ్రంగా ఉతికించాలి
- తివాచీలు వాడకుండా ఉండాలి
- దుమ్ము, ధూళి ఉన్న చోటుకు వెళ్లకూడదు
- పేపర్ల జోలికి వెళ్లకపోవటం
- ఇంట్లో బూజు దులపరాదు
- ఇల్లు ఊడవటానికి బదులుగా తడిగుడ్డతో తుడవాలి
- పెంపుడు జంతువులకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి-
- శీతల పానీయాలకు దూరంగా ఉండాలి



'సరిపోదా శనివారం' రన్‌టైమ్ 2.50 గంటలు

హీరోగా నాని నటిస్తున్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియాంకా అరుల్ మోహన్ హీరోయిన్. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో చిత్ర యూనిట్ బిజీగా ఉంది.తాజాగా 'సరిపోదా శనివారం' సెన్సార్ పూర్తిచేసుకుంది. ఈ సినిమా సెన్సార్ వచ్చేసిందనీ ఒక వీడియో ద్వారా నాని, ఎస్‌జె సూర్య, ప్రియాంక మోహన్ కాస్త డిఫరెంట్‌గా తెలిపారు. సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిందని వారు తెలిపారు. సినిమా రన్‌టైమ్ 2.35 గంటలు ఉన్నట్లుగా నాని ప్రకటించారు. ఆ వెంటనే తెరపైకి ఎస్‌జే సూర్య ఎంట్రీ ఇచ్చి ప్లస్ 15 మినిట్స్ అంటాడు. దీంతో సినిమా మొత్తం 2.50 గంటలు ఉన్నట్లుగా ప్రకటించారు.

నా హృదయం ముక్కలైంది : నాని

జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్‌నుద్దేశించి నటుడు నాని కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ నివేదికలో తెలియజేసిన షాకింగ్ విషయాల గురించి తెలుసుకుని తానెంతో బాధపడినట్లుగా చెప్పారు. 'ఈ విషయం గురించి తెలుసుకున్నప్పుడు నా హృదయం ముక్కలైంది. నా సెట్స్‌లో లేదా చుట్టుపక్కల ఇలాంటి సంఘటనలు జరగడం నేను ఎప్పుడూ చూడలేదు. మెయిన్‌స్ట్రీమ్ మూవీస్‌కు సంబంధించి ఇలాంటివి జరగవని నేను అనుకుంటున్నా. భారీ చిత్రాలను తెరకెక్కించటం కోసం ప్రతిఒక్కరూ శ్రమిస్తుంటారు. నా చుట్టూ ఉన్న వాళ్లు కాస్త జాగ్రత్తగా ఉండి ఉండొచ్చు. అందుకే నా లొకేషన్లలో ఇలాంటి సంఘటనలు జరిగినట్లు నా దృష్టికి రాలేదు. ఈ నివేదిక గురించి చదివినప్పుడు ...ఇలా ఎక్కడ జరుగుతుంది అని షాక్ అయ్యాను. సినీరంగంలో రాణించాలనే ఆసక్తితో చాలామంది మహిళలు ఇప్పటిరోజుల్లో ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నారు. గతంతో పోలిస్తే ఇండస్ట్రీపై ఆసక్తి చూపించే మహిళల సంఖ్య ఇప్పుడు మరింతగా పెరిగింది. వారు రాణించటానికి ఇక్కడ అనువైన పరిస్థితులు ఉండాలని కోరుకుంటున్నా' అని వ్యాఖ్యానించారు.



క్రికెట్‌కు ధావన్ గుడ్ బై

న్యూఢిల్లీ: టీమిండియా ఎడమచేతివాటం బ్యాటర్, మాజీ కెప్టెన్ శిఖర్ ధావన్ క్రికెట్ అన్ని ఫార్మాట్‌ల గుడ్‌బై చెప్పాడు. సోషల్ మీడియా వేదికగా గబ్బర్ తన రిటైర్మెంట్‌ను వెల్లడించాడు. క్రికెట్ అధ్యాయాన్ని ముగిస్తున్నట్లు శనివారం 'ఎక్స్'లో ఒక వీడియోను విడుదల చేశాడు. కెరీర్ ముగిసినట్లు, ఎన్నో జ్ఞాపకాలను మోసుకెళున్నట్లు అందులో వెల్లడించాడు. 'మీ ప్రేమ, అభిమానానికి థ్యాంక్స్.. గుండెల్లో శాంతిని నింపుకుని.. క్రికెట్‌కు అల్విదా చెబుతున్నా..' అంటూ పేర్కొన్నాడు. టీమిండియాకు సుదీర్ఘ కాలం ఓపెనర్‌గా రాణించిన ధావన్.. 17వన్డేల్లో, ఏడు టెస్టుల్లో కెప్టెన్‌గా ఉన్నాడు. టీమిండియా తరపున శిఖర్ ధావన్ చివరిసారి డిసెంబర్ 2022లో బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ఆడాడు. తన కెరీర్‌లో 34టెస్టులు, 167వన్డేలు, 68టీ20లు ఆడిన ధావన్. టెస్టుల్లో 2315, వన్డేల్లో 6793, టీ20ల్లో 1759 పరుగులు చేశాడు. ఇందులో 40 ప్లస్ సగటుతో.. 90 ప్లస్ స్ట్రయిక్ రేట్‌తో.. మొత్తం 24సెంచరీలు చేశాడు. వన్డేల్లో 5వేల పరుగులు చేసిన 8మంది బ్యాటర్లలో అతను ఒకడు. ఈ జాబితాలో ఇండియా నుంచి రోహిత్, కోహ్లీ మాత్రమే ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పంజాబ్ కింగ్స్ తరపున ఐపిఎల్‌లో చివరి టోర్నీ ఆడాడు.



భారత పారా షూటింగ్ బృందం

25కు పైగా పతకాలే లక్ష్యం

- **భారత పారా ఒలింపిక్ కమిటీ అధ్యక్షులు దేవేంద్ర**
- **28నుంచి పారా ఒలింపిక్స్**

పారిస్: 17వ పారా ఒలింపిక్స్‌లో ఈసారి భారత్ 25కు పైగా పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఈ విషయాన్ని భారత పారా ఒలింపిక్ కమిటీ అధ్యక్షులు దేవేంద్ర ఝుంజారియా శనివారం తెలిపాడు. 2020 టోక్యో పారా ఒలింపిక్స్‌తో పోల్చిచూస్తే ఈసారి అత్యధిక పతకాలు దక్కడం ఖాయమని ఆయన తెలిపాడు. 54మంది అథ్లెట్లతో టోక్యో పారా ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్ ఐదు స్వర్ణ, 8రజత, ఆరు కాంస్య పతకాలతో సహా మొత్తం 19 పతకాలు సాధించిందని, ఈసారి 84మంది అథ్లెట్ల భారీ బృందంతో బయల్దేరిన భారత్.. సునాయాసంగానే 25పతకాల పై మార్క్‌ను అందుకోవడం ఖాయమని తెలిపాడు. టోక్యో అథ్లెటిక్స్ విభాగంలో ఎనిమిది, షూటింగ్‌లో ఐదు, బ్యాడ్మింటన్‌లో నాలుగు పతకాలు దక్కాయి. ఇక టేబుల్ టెన్నిస్ విభాగంలో భావినా పటేల్, ఆర్చరీలో హర్వీందర్ సింగ్ పతకాలు సాధించి రికార్డు పుటల్లోకెక్కారు.




దేవేంద్ర ఝుంజారియా

షూటింగ్‌లో అవని లేఖరే మహిళల ఎస్‌హెచ్-1 10మీ. ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టించింది. 2024 పారా ఒలింపిక్స్‌లో 4,400మంది అథ్లెట్లు పాల్గోనున్నారు.

మూడేళ్ల ముందే ఒలింపిక్స్‌కు సాధన..

గత మూడేళ్లుగా పారా ఒలింపిక్స్ కోసం తమ అథ్లెట్లందరూ సన్నద్ధమవుతున్నారని దేవేంద్ర తెలిపాడు. అథ్లెట్లందరూ పతకాలు సాధించగల సమర్థులేనని, వారందరికీ ఓ ప్రణాళిక ప్రకారం శిక్షణ ఇచ్చామని ఆయన తెలిపాడు. ఇండియా గేమ్స్, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్(టిఒ పిఎస్) అందించిన సహకారం మరువలేనిదని, 2028 పారా ఒలింపిక్స్‌కు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నామన్నాడు.



కోలుకుంటున్న రవితేజ

హీరో రవితేజ కోలుకుంటున్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ విషయమై ట్విట్టర్‌లో పోస్టు పెట్టారు. సర్జరీ సాఫీగా సాగిందనీ, విజయవంతంగా పూర్తయ్యిందనీ, అందువల్లే తాను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లుగా పేర్కొన్నారు. రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమా ఇటీవల విడుదలైంది. తాజాగా ఆయన దర్శకుడు భాను భోగవరపు తీస్తున్న సినిమాలో నటిస్తున్నారు. శ్రీలీల హీరోయిన్. షూటింగ్‌లో భాగంగా రవితేజ గాయపడగా, హుటాహుటీన ఆసుపత్రికి తరలించగా శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటుండటంతో డాక్టర్లు డిశ్చార్జ్ చేశారు.

100 ఎకరాల్లో స్టూడియో నిర్మాణం?

ఆంధ్రప్రదేశ్‌లో సినిమాల నిర్మాణానికి గాను రాష్ట్రప్రభుత్వం ఓ భారీ స్టూడియో నిర్మాణానికి పూనుకుంది. టాలీవుడ్ హీరో, డిప్యూటీ సిఎం కె.పవన్‌కళ్యాణ్‌ను ఇటీవల సినిమా పెద్దలు కలిసి వెళ్లారు. వారంతా ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా పరిశ్రమ విస్తరణకు అవకాశాలపై చర్చించారు. దీని నిమిత్తం రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే నందిగామ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నందిగామ-కంచికచర్ల ప్రాంతాల్లో 100 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించనుందనేది సమాచారం. హైదరాబాద్‌కు నాలుగు గంటల ప్రయాణం, 40 కిలోమీటర్ల దూరంలో గన్నవరం ఎయిర్‌పోర్టు, విజయవాడ రైల్వే జంక్షన్, రాజధానికి అమరావతికి అతి సమీప ప్రాంతం కావటంతో ఈ ఎంపిక జరిగినట్లుగా సమాచారం. త్వరలో సినీ పరిశ్రమ పెద్దలతో పవన్‌కళ్యాణ్ మరో దఫా చర్చలు జరిపిన తర్వాత ఫైనల్ చేస్తారని తెలిసింది. ఇతర రాష్ట్రాల్లో అక్కడి రాష్ట్రప్రభుత్వాలే స్టూడియోలు నిర్మించిన నామమాత్రపు రుసుంతో అద్దెకిస్తున్నాయి. ఇదే విధంగా రాష్ట్రంలో స్టూడియో నిర్మించి సినిమాలకు ఇవ్వాలనే ఆలోచనలో రాష్ట్రప్రభుత్వం ఉంది.



ముష్ఫికర్ భారీ శతకం

- **డ్రా దిశ పాకిస్తాన్-బంగ్లాదేశ్ తొలి టెస్ట్**

రావల్పిండి: పాకిస్తాన్- బంగ్లాదేశ్ జట్ల మధ్య జరుగుతున్న తొలిటెస్ట్ డ్రా దిశగా పయనిస్తోంది. బంగ్లాదేశ్ సీనియర్ వికెట్ కీపర్ ముష్ఫికర్(191) భారీ శతకంతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌లో 117పరుగుల ఆధిక్యత లభించింది. ఓవర్‌నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 495పరుగులతో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ మరో 70పరుగులు జతచేసి చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది. పాకిస్తాన్ బౌలర్లు నసీమ్ షాకు మూడు, షాహిన్ అఫ్రిది, షాజాద్, మహ్మద్ అలీకి రెండేసి, ఆయుబ్‌కు ఒక వికెట్ దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ జట్టు నాల్గోరోజు ఆట ముగిసే సమయానికి ఆయుబ్(1) వికెట్ కోల్పోయి 23పరుగులు చేసింది. షఫీక్(12), కెప్టెన్ మసూద్(9) క్రీజ్‌లో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్తాన్ జట్టు 6వికెట్ల నష్టానికి 448పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసిన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68